RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 315 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, జూన్, 4, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 2 | ISSUE NO : 315 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, June,4,2025 | PAGES : 8 RS : 4 /-



## భారత్‌తో వాణిజ్య ఒప్పందం
# ఎంతో దూరంలో లేదు

- త్వరలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు
- ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం అంటున్న అమెరికా వాణిజ్య కార్యదర్శి

వాషింగ్టన్: భారతదేశం–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుంకాల ప్రతిష్టంభన నేపథ్యంలో చర్చలు ఊపందుకున్నాయని, రెండు దేశాలకూ ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రయోజనాలపై ఏకాభిప్రాయం కుదిరిందని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్–ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక (యూఎస్ఐఎస్‌పీఎఫ్) ఎనిమిదో వార్షిక సదస్సులో పాల్గొన్న లుట్నిక్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం సమీప భవిష్యత్తులోనే కుదురుతుందని మీరు ఆశించవచ్చు" అని అన్నారు.



## రైతులకు రక్షణగా
# భూభారతి చట్టం

- రైతులను దగా చేసిన ధరణి పోర్టల్
- అత్యతం పారదర్శకంగా భూభారతి
- తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం,తెలంగాణ దిశ: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ రైతులకు మేలు చేసేలా చట్టాలురూపొందిం చిందని, గత బిఆర్ఎస్ మాత్రం రైతు లను దగ చేసే చట్టాలను తెచ్చిందన్నా రు. అందుకు ధరణి పోర్టలే నిదర్శ నమన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరా వుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడు తూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సద స్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం జూన్ 2 రోజున భూ భారతి చట్టం అమల్లోకి వచ్చింది.



## కెనడా జీ7 సదస్సుకు
# భారత్‌కు అందని ఆహ్వానం..

### ఆరేళ్లలో ఇదే మొదటిసారి!

ఢిల్లీ,: కెనడా ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక జీ7 కూటమి శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈసారి దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇది దౌత్యపరమైన వైఫల్యమని పేర్కొంది. ఆరేళ్ల కాలంలో ప్రధాని మోదీ జీ7 సమావేశానికి హాజరుకాకపోవడం ఇదే తొలిసారి. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితులు, రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఇతర కీలక సవాళ్లపై సభ్య దేశాల అధినేతలు చర్చించనున్నారు.



## ఆధార్ కార్డు లాగే భూములకు
# త్వరలో భూధార్

- భూధార్ నంబర్ కొట్టగానే అన్నివివరాలు వెల్లడి
- సర్వేయర్లను నియమించి భూముల సర్వే
- గత పదేళ్లపాటురైతులు నాని ఇబ్బందులుపడ్డారు
- ఎర్రుపాలెం రెవెన్యూ సదస్సులో మంత్రి తుమ్మల

**ఖమ్మం,తెలంగాణ దిశ:** మనుషులకు ఆధా ర్ కార్డు లాగే భూములకు త్వరలో భూధార్ తీసుకువస్తాం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా భూభారతి చట్టం తీసుకొచ్చా మని అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపా లెం సదస్సుకు మంత్రులు ఉపము ఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగు లేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల సదస్సులో మాట్లాడుతూ.. కంప్యూటర్ లో భూధార్ నంబర్ కొట్టగానే అన్నివివరాలు వస్తా యని, లైసెన్స్ డ్ సర్వేయర్లను నియ మించి భూములను సర్వే చేయిస్తామ ని చెప్పారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని, రెవెన్యూ అధికారులు గ్రామాల్లోనే రైతుల సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. అభించక పదేళ్లపాటు రైతులు ఇబ్బంది పడ్డారని తుమ్మల నాగేశ్వర రావు మండిపడ్డారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రైతుబంధు రూ. 7600 కోట్లు– చెల్లించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



## ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత ప్రాజెక్టుపై
# తెలంగాణ మంత్రి తీవ్ర అభ్యంతరం

- ఏపీ బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ
- ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ
- సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటామనడంపై ఉత్తమ్ ఆగ్రహం
- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు, జీఆర్ఎంబీకి లేఖలు రాసినట్లు వెల్లడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం మరోమారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సముద్రంలోకి వృథాగా పోయే జలాలనే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ నేతలు పేర్కొనడం విస్మయం కలిగిస్తోందన్నారు.




## అస్సాంలో వరదలు..
## కొండచరియలు విరిగి
# 11 మంది మృతి

గౌహతి : అస్సాంలో వరదలు, కొండచరియలు విరిగిపడి 11 మంది మృతి చెందారు. వరదల వల్ల ఆరుగురు, కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి చెందినట్లు అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్‌డిఎంఎ) నివేదిక వెల్లడించింది. ఈ వరదల వల్ల అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 5.15 లక్షలమంది ప్రజలు ప్రభావితమయ్యారు. ఇక గడిచిన 24 గంటల్లో వరదనీటిలో మునిగి ఒకరు మృతి చెందగా.. ఇద్దరు గల్లంతయ్యారు. మృతి చెందిన వ్యక్తి హొజై జిల్లాకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. వరదనీటిలో గల్లంతైన వారు హైలకండి, దిబ్రూఘర్ జిల్లాలకు చెందినవారు.



## కాంగ్రెస్ కమిటీల్లో
# మహిళలు ఎక్కడ..?

హైదరాబాద్,తెలంగాణ దిశ: కాంగ్రెస్ అధిష్ఠానం ఇటీవలే ప్రకటించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి సంబంధించిన ఐదు కమిటీలపై పలువురు సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక మహిళలకు పార్టీ పదవుల విషయంలో పూర్తిగా నిరక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు.ఢిల్లీలో సోనియాగాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షినటరాజన్ ఉన్నప్పటికీ.. ఏఐసీసీ ప్రకటించిన ఐదు కమిటీల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించకుండా మొండిచెయ్యి చూపారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మహిళలకు చట్టసభల్లో 33శాతం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజ ర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ ఉభయసభల్లో మహిళా బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని రాహుల్ గాంధీ డిమాండ్‌చేస్తున్నారు. కానీ తమ పార్టీ పదవుల విషయంలో మాత్రం మహిళలకు 33 శాతం ఎందుకు అమలుచేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.గత శుక్రవారం ప్రకటించిన ఐదు కమిటీల్లో మొత్తం 66మంది ఉండగా, మహిళలకు ఆరుగురికి మాత్రమే చోటివ్వడంపై విస్మయం వ్యక్తమవుతోంది. 'మహిళల ఓట్లు కావాలి.. మహి ళలు పార్టీ కోసం పనిచేయాలి..



## షర్మిష్ఠ పనోలికి
## బెయిల్ నిరాకరించిన
# కోల్‌కతా హైకోర్టు


కోల్‌కతా: ఆపరేషన్ సిందూర్ సమయంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణలపై అరెస్టయిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠ పనోలి కి కోల్‌కతా హైకోర్టులో చుక్కెదురైంది. ఆమెకు బెయిల్ ఇచ్చేందుకు మంగళవారం నాడు హైకోర్టు నిరాకరించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకూ ఒక పరిమితి ఉంటుం దని.. వ్యక్తులు, మతపరమైన భావోద్వేగాలను గాయపరచ రాదని పేర్కొంది. 'మనకు భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంది. అంటే దాని అర్థం ఇతరుల మనోభావా లను గాయపరచమని కాదు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం మనది. వివిధ భాషలు, కులాలు, మతాలు ఉన్నాయి.

# హౌసింగ్ బోర్డు కృష్ణానగర్ లో తాగుబోతు హల్ చల్

- తప్ప తాగి హెూండా సిటీ కారుతో ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ కు టక్కర్
- బ్రీత్ అనలైజర్ టెస్ట్ లో 163 ఆల్కహాల్ బ్లడ్ కౌంట్ వచ్చినా.., పట్టించుకోని పోలీసులు
- రాచకొండ కమిషనర్ కు ఫిర్యాదుతో వెలుగు చూసిన సంఘటన




**కుషాయిగూడ, జూన్ 03, (తెలంగాణ దిశ)** :మీర్ పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ కృష్ణానగర్ లో తాగుబోతు హల్ చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. తప్ప తాగి హెూండా సిటీ కారుతో ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ కు టక్కర్ తో గాయాలపాలు చేసి పరారయ్యాడు. బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా ఆల్కహాల్ బ్లడ్ కౌంట్ 163 వచ్చినా..,! పరిధి తమది కాదనడంతో వెంట వచ్చిన స్నేహితులతో కలిసి తాగుబోతు పారిపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన వారం రోజుల క్రితం జరిగినప్పటికీ కుషాయిగూడ పోలీసులు పట్టించుకోకపోవడంతో బాధితుడు సోషల్ మీడియా ద్వారా మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ వివరాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేసే కుషాయిగూడకు చెందిన ప్రవీణ్ కుమార్ గత నెల మే 27వ తేదీ మంగళవారం ఉదయం8.45 గంటల ప్రాంతంలో మీర్ పేట్ హౌసింగ్ బోర్డు కృష్ణా నగర్ వైపుగా ద్విచక్ర వాహనం పై వెళుతుండగా ఓ తాగుబోతు హెూండా సిటీ కారు(ఎపి 28డిజి 7056)ను అతివేగంగా నడుపుతూ సైకిల్ మోటార్ ను ఢీ కొట్టాడు. దీంతోలెక్చరర్ ప్రవీణ్ కుమార్ కు రెండు కాళ్లకు, చేతికి స్వల్పంగా దెబ్బలు తగిలాయి. సదరు మందుబాబు స్నేహితులను పిలిపించుకుని కారు పాడయిందంటూ ప్రవీణ్ కుమార్ ను డబ్బులు ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో భయపడిన సదరు లెక్చరర్ అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో తన బావకు ఫోన్ చేసి జరిగిన సంఘటనను వివరించాడు. దీంతో అతను తక్షణ సహాయం కోసం డయల్ 100కు ఫోన్ చేయమని సూచించారు. లెక్చరర్ 10 గంటల సమయంలో డయల్ 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ నుంచి మోటార్ సైకిల్ పై సంఘటన స్థలమైన కృష్ణానగర్ కు వచ్చిన ఇద్దరు పోలీసులలో ఒకరు కారులో కూర్చొని కారును చర్లపల్లి పోలీస్ స్టేషన్ తీసుకు వెళ్ళారు. సదరు కానిస్టేబుల్ కు కారు నడుపుతున్న వ్యక్తి తాగినట్లు అనుమానించి పై అధికారులకు విషయాన్ని వివరించారు. దీంతో సదరు మందు బాబుకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని ప్రయత్నించారు. అతను ప్రతిఘటించి మోటార్ సైకిల్ నడుపుతున్న లెక్చరర్ కేబ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని పట్టు పట్టాడు. అదే రోజు ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు తొలుత లెక్చరర్ కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేసారు. అతనికి టెస్ట్ రిపోర్ట్ జీరో వచ్చిందని చూపించింది. తరువాత మందు బాబుకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడంతో 163 ఆల్కహాల్ బ్లడ్ కౌంట్ వచ్చింది. తీరా ప్రమాదం జరిగిన స్థలం తమ పరిధిలోకి కాదంటూ బ్రీత్ అనలైజర్ టెస్ట్ రిపోర్ట్ ను గాయపడిన లెక్చరర్ చేతిలో పెట్టి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చి పంపించి వేశారు. ఇదే అదనుగా భావించిన మందుబాబు స్నేహితులతో కలిసి కారుతో ఉడాయించాడు. చేసేది లేక ఊసురోమంటూ గాయపడిన లెక్చరర్ ప్రవీణ్ కుమార్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ కు వెళ్ళి కారు నెంబరు, ఫోటోలతో సహా ఫిర్యాదు చేసారు. సంఘటన జరిగి వారం రోజులైనా తప్ప తాగి కారు నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తి గాని, కారు ఆచూకీ గాని ఇంత వరకు తెలియకపోవడంతో బాధితుడు రాచకొండ కమిషనర్ ను సంప్రదించారు.



# కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 03, (తెలంగాణ దిశ)** :కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలుష్య నివారణ కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికలను మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని జెవల్ బి హరిప్రియ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త జి. లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి





**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 03, (తెలంగాణ దిశ)** :భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులందరరూ తమ తమ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో అధికారులకు అర్జీలను అంద జేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి రైతులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా మంగళవారం ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్, మార్గాతిగూడ, శామీర్‌పేట్ మండలంలోని పోతాయిపల్లి గ్రామాలలోని వార్డు కార్యాలయంలో భూ భారతి రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణ తీరుతెన్నులను తహసిల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని సూచించారు. రైతులకు సంబంధిత డాక్యుమెంట్లను జతచేయాలని తెలియజేయాలన్నారు. అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, చొరవ తీసుకొని వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని కోరారు. సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డ్ లను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా వెను వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వం పై భరోసా కల్పించాలన్నారు. తద్వారా రైతులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. అర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్, శామీర్‌పేట్ తహశీల్దార్లు రజిని, యాదగిరిరెడ్డి, డిప్యూటి తహశీల్దార్ భాస్కర్, ఆర్ఐలు కావ్య, సాయిరామ్, సిబ్బంది ఆధిత్య తదితరులు పాల్గొన్నారు.

# జై హింద్ సభ విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతలు





**కుత్బుల్లాపూర్, జూన్ 03, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ లో గత నెల 29న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జైహింద్ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జిహెచ్ఎంసి 8 డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. జై హింద్ సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జైహింద్ సభను నిర్వహించిన విషయం విధితమే. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఐటీ మంత్రి డి. శ్రీధర్ బాబు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జై హింద్ సభకు హాజరై విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, మేడ్చల్ జిల్లా లోని వివిధ నియోజకవర్గ ఇంచార్జ్‌లకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ధమ్మని శ్రావణ్ కుమార్, దళిత సేన ఆల్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ అవిజే జేమ్స్, డివిజన్ అధ్యక్షులు ఎండి. లయాక్, గణేష్, బి. శివకుమార్, పండరీ రావు, సంతోష్ ముదిరాజ్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, ఎండి. జాకీర్, బేకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ సాధ్యం

- దోమల నివారణ కోసం ఈనెల 25 వరకు కార్యాచరణ- కార్యక్రమాన్ని ప్రారంభించిన కాప్రా సర్కిల్ డిసి జగన్





**కాప్రా, జూన్ 3 : (తెలంగాణ దిశ)** :వన్ డే వన్ వార్డు కార్యక్రమంలో భాగంగా దోమల నిర్మూలన కోసం ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ సూచించారు. మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని గాంధీ కాలనీలో దోమల నివారణ కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శానిటేషన్, ఎంటమాలజీ విభాగాల కార్మికులకు పలు సూచనలు చేసారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దోమల నిర్మూలన మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఈ నూతన కార్యాచరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సర్కిల్ డిసి జగన్, కాప్రా డివిజన్ కార్పొరేటర్ శివమణి స్వర్ణరాజు, శానిటేషన్ ఎస్ఎస్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేష్ లు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ లోని పలు ఇండ్లలో నీటి నిల్వలను పరిశీలించి సేకరించిన లార్వాపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. లార్వా ద్వారా అభివృద్ధి చెందే దోమ వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాపిస్తాయని, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఇన్ సెట్ కలెక్టర్లు, సిబ్బంది, శానిటేషన్ జవాన్లు, ఎస్ఎఫ్ఏలు, కార్మికులు, తదితరులు పాల్గొని వన్ డే వన్ వార్డు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తార్నాక నుండి కీసర ఓఆర్ఆర్ వరకు మెట్రో రైల్ విస్తరించాలి

- పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు వినతి పత్రం సమర్పించిన బిజెపి నాయకులు



**కాప్రా, జూన్ 03, (తెలంగాణ దిశ)** :తార్నాక నుండి కీసర ఓఆర్ఆర్ వరకు మెట్రో రైల్ విస్తరించాలని కోరుతూ మంగళవారం బిజెపి నేతలు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ వినతి పత్రం సమర్పించారు. షామీర్ పేట్ లోని ఈటెల నివాసంలో కాప్రా సర్కిల్ భారతీయ జనతా పార్టీ నాయకులు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. తార్నాక నుండి కీసర ఓఆర్ఆర్ వరకు పెరిగిన ట్రాఫిక్ రద్దీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ మార్గంలో రోజు వేలాదిమంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. గతంలో తార్నాక నుండి ఈసీఐఎల్ చౌరస్తా వరకు మెట్రో ప్రతిపాదన చేసారని వారు గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మెట్రో రైల్ విస్తరణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ మాజీ అధ్యక్షులు డి. నాదం, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం. లక్ష్మణ్ గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, ఎం. గణేష్ ముదిరాజ్, విద్యాసాగర్, అప్పి, బొల్లా శ్రీనివాస్, రత్తపురం వెంకటేష్, పి. రాజు, రామకృష్ణ, జహంగీర్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ ఆరోగ్యకరమైన రవాణా మార్గం

- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





**కుత్బుల్లాపూర్, జూన్ 03, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో మంగళవారం ప్రపంచ బైసైకిల్ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయం ఆవరణలో సైక్లింగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ప్రజలందరూ ఆనందించాల్సిన ప్రత్యేక రోజు అని అన్నారు. మానవ పురోగతికి చిహ్నంగా సైకిల్ "సహనం, పరస్పర అవగాహన, గౌరవాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సామాజిక సమ్మిళితత్వాన్ని, శాంతి సంస్కృతిని సులభతరం చేస్తుందన్నారు. స్థిరమైన రవాణాకు చిహ్నం సైకిల్ అని, సైకిల్ వినియోగం, ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సానుకూల సందేశాన్ని అందిస్తుందన్నారు. సైక్లింగ్ వాతావరణ పై సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కోలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ మెంబర్స్ భీమ్ సింగ్, గడిలా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రా మారథాన్ కు ఎంపికైన తెలంగాణ అథ్లెట్ నవ్య

- రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసిన బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్




**హైదరాబాద్, జూన్ 03, (తెలంగాణ దిశ)** :ఈనెల 8వ తేదీన సౌత్ ఆఫ్రికాలో జరగనున్న 90 కిలోమీటర్ల అల్ట్రా మారథాన్ లో ఎంపికైన తెలంగాణ అథ్లెట్ నవ్యను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మంగళవారం అభినందించారు. నల్లగొండ జిల్లా చీకటి గూడెంకు చెందిన నవ్య గచ్చిబౌలి స్టేడియంలో శిక్షణ పొందుతుంది. సౌత్ ఆఫ్రికాలో జూన్ 8 ఆదివారం నిర్వహించ తలపెట్టిన 90 కెఎం ఆల్ట్రా మారథాన్ కు నవ్య ఎంపికైంది. ఈ పోటీలో పాల్గొనడానికి నవ్యకు బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు భరత్ రెడ్డి, బాల కిషన్ లు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని నవ్యకు గచ్చిబౌలి స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో అందజేశారు.

## సంపాదకీయం

# శాంతి కోసం ఎదురు చూపు

మణిపూర్ విధ్వంసానికి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్ల కాలం ఎన్నో విషాదకర సంఘటనలకు, మానవతా సంక్షోభానికి సాక్ష్యంగా నిలిచింది. రెండు తెగల మధ్య మతోన్మాద రాజకీయం సృష్టించిన విధ్వంసక క్రీడలో అమాయక ప్రజలు ఊచకోతకు గురైన మే 3వ తేదీ చరిత్రలో ఓ చేదు జ్ఞాపకం. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ రాష్ట్రం, ఇప్పుడు భయం, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతోంది. తెగల మధ్య నెలకొన్న వైషమ్యాలతో ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోగా, మరెన్నో జీవితాలు శాశ్వతంగా గాయపడ్డాయి. ఈ ఘర్షణ దాని సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాన్ని దీర్ఘకాలిక మానవతా సంక్షోభంలోకి నెట్టివేసింది. గత రెండేళ్లలో ఏం జరిగిందో ఒకసారి గుర్తు చేసుకుంటే, ఈ అల్లర్ల వెనుకనున్న శక్తులెవరో అర్థమవుతుంది. మెయిటీ, కుకీ తెగల మధ్య మొదలైన ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇళ్లు, చర్చిలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి, స్త్రీలపై అత్యాచారం జరిగింది. మహిళలు, పిల్లలు సైతం హింసకు గురయ్యారు. 70వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులవ్వగా, 260మందికి పైగా మరణించారు. వందలాది ఇళ్లు, గ్రామాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన ప్రజలు ఇప్పటికీ కొండలు, లోయలలోని సహాయ శిబిరాల్లో మగ్గుతున్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 'హింస ఎప్పుడూ పరిష్కారం కాదు, అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే తెస్తుంది' అంటారు గాంధీజీ. ఈ హింస మణిపూర్‌లో కూడా విధ్వంసాన్నే సృష్టించింది. ఇప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. రాష్ట్రంలోని రెండు ప్రధాన తెగల మధ్య పరస్పర అపనమ్మకం అనే అగాధం చాలా లోతుగా ఏర్పడింది. ఫలితంగా మణిపూర్ సమాజం తీవ్రంగా నష్టపోయింది. తరతరాలుగా కలిసి జీవించిన ప్రజల మధ్య అవిశ్వాసం పెరిగిపోయింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాలు కుంటుబడ్డాయి. భవిష్యత్తు తరాల మీద ఈ హింస యొక్క ప్రభావం చాలా కాలం పాటు ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. అల్లర్లను నివారించడానికి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి ఒక తెగకు ప్రతినిధిగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికీ నిమ్మకునీరెత్తినట్లుగానే వుంది. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని మోడీ ఆ రాష్ట్రంవైపు కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది. ప్రతిపక్ష పార్టీలు, మానవహక్కుల సంస్థలు, సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ శాంతిని నెలకొల్పడానికి కేంద్రప్రభుత్వం ఇప్పటికీ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదన్నది సుస్పష్టం. ఆ రాష్ట్ర ప్రజలకన్నా తమ సొంత రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. 'గతం నుండి నేర్చుకోని వారు దానిని పునరావృతం చేయడానికి ఖచ్చితంగా సిద్ధంగా ఉంటారు' అని స్పానిష్-అమెరికన్ తత్వవేత్త జార్జ్ శాంటాయన అంటారు. ఈ సంఘటనలు మణిపూర్‌లో పునరావృతం కాకూడదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో, శాంతి స్థాపన, బాధితులకు న్యాయం చేకూర్చడం అత్యంత ఆవశ్యకం. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హింసకు కారకులైన వారిని శిక్షించాలి. నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలి. ఇక్కడి ప్రజల మధ్య సయోధ్య కుదిర్చేందుకు చర్యలు చేపట్టాలి. 'న్యాయం ఆలస్యం అయితే, న్యాయం నిరాకరించినట్లే' అంటారు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. రెండేళ్లపాటు మణిపూర్‌కు కేంద్రప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు. 'ఎక్కడ అన్యాయం జరుగుతుందో, అక్కడ తిరుగుబాటనేది ఒక కర్తవ్యం' అంటారు థామస్ జెఫర్సన్. బాధితులకున్యాయం జరగాలి. స్థానికంగా వున్న వివిధ తెగల ప్రతినిధులతో చర్చలు జరపడం ద్వారా ఇప్పటికే తగిలిన గాయాలను మాన్పేందుకు చర్యలు తీసుకోవాలి. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు, శాంతి సామరస్యతను పాదుగొలిపేందుకు న్యాయమైనపరిష్కారాలను కనుగొనడా నికి అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలి. నిర్దిష్ట కాలవ్యవధిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించాలి. శాంతికోసం ఎదురుచూస్తోన్న ఆ ప్రజల హక్కులకు రక్షణగా నిలవాలి. అప్పుడే మణిపూర్ తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలదు.

# విజయనగర్ కాలనీలో పాత ఇంటిపై రెండు అదనపు అంతస్తుల అక్రమ నిర్మాణం

### - నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పుట్టగొడుగుల్లా అదనపు అంతస్తులు - అక్రమ నిర్మాణాలపై చోద్యం చూస్తున్న కమిషనర్..?




**నాగారం, జూన్ 3, (తెలంగాణ దిశ):** అక్రమ నిర్మాణాలను చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న నాగారం టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు.. దోచుకున్న వాడికి దోచుకున్నంత మహదేవా... అన్నట్టుగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యంతో అదనపు అంతస్తులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వివరాలలోకి వెళ్తే.... నాగారం మున్సిపల్ తొమ్మిదవ వార్డు లోని విజయ నగర్ కాలనీలో పాత ఇంటిపై అక్రమంగా రెండు అదనపు అంతస్తులను నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. స్థానిక నాయకుల ప్రమేయంతో అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నాగారం మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న తీరు చూస్తుంటే ఔరా అనిపిస్తుంది. ఇందుకు నిదర్శనంగా నాగారంలో రోజు రోజుకు ఊపందుకుంటున్న అక్రమ నిర్మాణాలు తీరు అద్దం పడుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణానికి స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా నాగారం మున్సిపల్ పరిధిలో ఇల్లు కట్టుకోవాలంటే అనుమతులు అవసరం లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ విచారణ చేస్తే సుమారు 70 శాతం నిర్మాణాలకు అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని స్పష్టమవుతుందని స్థానికులు తెలుపుతున్నారు. కానీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలకు అండదండలు అందిస్తూ చట్టాలను సైతం తుంగలో తొక్కేసి అందినకాడికి దండుకుంటూ.. ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, టిపిఓ స్పందించి తక్షణమే విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# మహిళా కాంగ్రెస్ నేతలకు రాజకీయ నాయకత్వ లక్షణాలపై శిక్షణ








**న్యూఢిల్లీ, జూన్ 03, (తెలంగాణ దిశ) :** మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాళ్లకు నాయకత్వ లక్షణాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి తెలంగాణలోని ఐదు జిల్లాలా అధ్యక్షురాళ్ళు హాజరయ్యారు. వీరిలో సికింద్రాబాద్ నుంచి పి. కవిత, జనగాం బడికే ఇందిర, మహబూబాబాద్ నునావత్ రాధ, హనుమ కొండ బంక సరళ, వరంగల్ పార్వతమ్మలు హాజరయ్యారు. ప్రతి మంగళవారం న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ లో నాయకత్వ లక్షణాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలిపారు. దశలవారీగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్ళకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. సమకాలీన రాజకీయ అంశాలతో పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలకు అనుగుణంగా వ్యవహరించవలసిన తీరుతెన్నులపై శిక్షణ ఇస్తారని ఆమె తెలిపారు. ప్రతి మంగళవారం జరిగే ఈ శిక్షణకు తెలంగాణ నుంచి ఐదు జిల్లాలా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్ళు హాజరవుతారని ఆమె తెలిపారు. శిక్షణకు హాజరైన మహిళా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించిన మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కాలాంబ, మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నాలాలోంచి తీసిన వ్యర్థాలు.., మళ్లీ నాలా లోకేనా..!?

### - నాలాల పూడిక తీత పనులు అస్తవ్యస్తం



**కుషాయిగూడ, జూన్ 03, (తెలంగాణ దిశ) :** నాలా పూడికతీత పనుల్లో భాగంగా తీసిన వ్యర్థాలను మళ్లీ నాలాలోకే పంపించేస్తారా అని ప్రశ్నిస్తున్నారు స్థానికులు. కాప్రా చెరువు నుంచి నాగారం చెరువు వరకు వెళ్లే నాలాలో మట్టి, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి ఒడ్డున వేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వరద ప్రవాహం సాఫీగా వెళ్లేందుకు నాలాల నుంచి తొలగించిన మట్టి చెత్తాచెదారంతో పాటు వ్యర్థాల పూడికను సదరు కాంట్రాక్టర్ అక్కడే వదిలేయడంతో మళ్లీ ఆ మట్టి, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాలోకి జారిపోతున్నాయని సమీప కాలనీలా ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లక్షలాది రూపాయలు హెచ్చించి పూడికతీత పనులు చేపట్టిన ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి అధికారులు జోక్యం చేసుకొని నాలా పరిసరాల్లో వేసిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చర్లపల్లి కాలనీలా సమాఖ్య (సిసిఎస్) అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి కోరారు.

# అమరావతి 'కాలచక్ర'..



**రాజధాని అమరావతి నిర్మాణ పనుల పున:ప్రారంభం పేరిట భారీ కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర పాలకుల పరస్పర పొగడ్తలు ఒకవైపు, ప్రజలను మభ్యపుచ్చడం మరోవైపున ఏకకాలంలో జరిగి పోయాయి. పదేళ్ల క్రితం అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తాజాగా ఆ పనులనే పున:ప్రారంభించారు. అట్టహాసంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలోనే ఆయన రూ. 58 వేల కోట్ల విలువ చేసే 92 ప్రాజెక్టులకు శంకు స్థాపనలు వర్చువల్‌గా చేశారు. ఇందులో గుంతకల్ సమీపంలోని రోడ్ ప్రాజెక్టు మొదలు నాగాయలంక క్షిపణి ప్రయోగ కేంద్రం వరకూ అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని కేంద్ర ప్రభుత్వానివి కాగా అత్యధికం రాష్ట్ర ప్రాజెక్టులే! ఇవన్నీ రాజధాని అమరావతికి సంబంధించినవేనన్న రీతిలో బిల్డప్ ఇవ్వడం మరో ప్రత్యేకత.**


మాట మార్చిన మోడీ: తిరుపతి వెంకన్న సాక్షిగా 2014 ఎన్నికల సభలో 'ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తాం' అని రాష్ట్ర ప్రజలకు హామీనిచ్చిన మోడీ ఆ మాట ఈ పదేళ్లలో దాదాపు మర్చిపోయారు. కానీ సభలో 'గత పదేళ్లుగా అమరావతికి అన్ని విధాలా సంపూర్ణ మద్దతునిస్తున్నాం' అని కొండంత అబద్ధం చెప్పడం ఆయనకే చెల్లింది. జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల విచ్ఛిన్నకర ప్రతిపాదన తెచ్చినపుడు దాన్ని కేంద్రం వ్యతిరేకించలేదు. పైపెచ్చు రాజధాని విషయం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినదేనంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఒక అఫిడవిట్ దాఖలు చేసి నాటి ముఖ్య మంత్రికి పరోక్ష మద్దతునిచ్చిన చరిత్ర చెరిగిపోతుందా? కనుక ఆనాటి నుండి ఈనాటి వరకూ కేంద్ర ప్రభుత్వం రాజధాని అమరావతి రూపు దాల్చడానికి సహకరించింది లవలేశ మాత్రమూ లేదు. తొలుత శంకుస్థాపనకు వచ్చినప్పుడూ ప్రధాని పిడికెడు మట్టి చెంబుడు నీళ్లు తెచ్చారుతప్ప రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదు. తగుదునమ్మా అంటూ ఇప్పుడు సంపూర్ణ సహకారం అని చెప్పినంత మాత్రాన జనం నమ్ముతారా!

మూడేళ్లలోనే నిర్మిస్తాం..!: 'అమరావతి పనులు మూడేళ్లలోనే పూర్తి చేసి ప్రధాని మోడీ చేతులమీదుగా ప్రారంభిస్తామ'ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సభలో గొప్పగా ప్రకటించారు. అయితే ఈ పనులకు అవసరమైన సొమ్ములో కేంద్ర ప్రభుత్వం ఏమిస్తుంది? రాష్ట్రం భరించాల్సినదేమిటి అన్న వివరాల్లేవు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నిర్మించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. కానీ రాష్ట్ర విభజన అమలులోకొచ్చిన నాటి నుండీ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ ఈ బాధ్యతను నెరవేర్చిన దాఖలాల్లేవు. తొలినాళ్లలో మంజూరు చేసిన రూ.1,500 కోట్లు మినహా ఇంకే నిధులూ రాజధాని నిర్మాణాని కి కేంద్రం ఇవ్వని విషయం అందరికీ తెలిసిందే! ఇప్పుడయినా ఈ నిర్మాణాల్లో వేటికి కేంద్రం ఎంత ఇస్తుందో రాష్ట్ర పెద్దలు అడగాలి కదా! అలాంటిదేమీ లేదు. ఇప్పటికి ఉన్న సమాచారం ప్రకారం రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు తదితర సంస్థల నుండి అప్పులు లేదా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 50 సంవత్సరాల అప్పు అన్నది కఠోర వాస్తవం. కేంద్రం గ్రాంటుగా ఇవ్వాలనీ, విదేశీ సంస్థల అప్పులను కేంద్రమే తిరిగి చెల్లించాలనీ హక్కులా గట్టిగా అడగడానికి రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇతరేతర కారణాలుంటే కనీసం విన్నపమయినా చేయాలి. తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో నాడు ఎన్‌టి రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ వారసత్వం ఇదా! అని జనం ముక్కున వేలేసుకుంటున్న పరిస్థితి.

పరస్పర పొగడ్తలు: సభా వేదికపై ప్రధాని, ముఖ్యమంత్రి పరస్పర పొగడ్తలు ఆశ్చర్యం కలిగించాయి. 'టెక్నాలజీ అంటేనే మోడీ' అని ముఖ్యమంత్రి చెబితే 'నేను గుజరాత్ సిఎం అయిన కొత్తలో హైదరాబాద్‌లో చంద్రబాబు చేసిన పనులను పరిశీలించేవాడిని. టెక్నాలజీ విషయంలో చంద్రబాబు నుండి చాలా నేర్చుకున్నాను' అని ప్రధాని అన్నారు. వీరిద్దరిలో ఎవరు ఎవరినుండి నేర్చుకున్నారో అర్థం కాక జనం జుట్టు పీక్కోవాల్సిన పరిస్థితి. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖామాత్యులు ప్రధానిని ప్రస్తుతించిన తీరు రాజుల కాలంలోని వందిమాగధుల్ని తలపింపజేసింది. మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో గొప్ప శక్తిగా ఆవిర్భవిస్తోందని సిఎం చెప్పారు. ఆకలి సూచిలో, మానవాభివృద్ధి సూచికల్లో, ప్రజాస్వామ్యానికి కొలబద్దగా భావించే పత్రికా స్వేచ్ఛ సూచీల్లో మోడీ హయాంలో భారత్ ఏడాదికేడాది దిగజారుతున్న వాస్తవం 'విజనరీ' ముఖ్యమంత్రి గారికి తెలియదనుకోగలమా! అయినా, ప్రధానిని పొగడాలనుకున్నారు కనుక అలా అన్నారు అని ఎవరయినా సరిపెట్టుకోవచ్చు. ఇక ఉప ముఖ్యమంత్రి ఏకంగా భారతదేశమే ఇల్లుగా భావిస్తున్న మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఇల్లులాంటి రాజధాని అమరావతిని అందిస్తున్నారని పేర్కొన్నారు. మరి రెండేళ్లుగా రగిలిపోతున్న మణిపూర్ సందర్శనకు వెళ్లని ప్రధాని ఆ రాష్ట్రం ఈ దేశంలో లేదని భావిస్తున్నట్టా? ఆ రాష్ట్ర ప్రజలు ఈ ఇంటివారు కాదా? నరేంద్ర మోడీ అనే మిసైల్ వుండగా వందల పాకిస్తాన్‌లు కూడా ఏమీ చేయలేవంటూ రెచ్చగొట్టే మాటల్లో తాను కూడా ఉప ముఖ్యమంత్రికి తీసిపోనన్న రీతిలో విద్యా శాఖామాత్యులు వ్యవహరించారు.

ప్రపంచ పటంలో అమరావతి: అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా భారత దేశ పటంలోనే కేంద్రం అధికారికంగా పేర్కొనలేదు. కాని, అమరావతిని ప్రపంచ పటంలో నిలబెడతామని ముఖ్యమంత్రి గొప్పగా చెప్పారు. అంతేగాక అమరావతికి పార్లమెంటులో చట్టం చేయిస్తామని ఆయన వివిధ సభల్లో చెబుతున్నారేతప్ప ఆ పని చేయవలసిన ప్రధాని ఈ సభలోఆ ఊసే ఎత్తలేదు. అంటే అది జరుగుతుందా లేదా అన్నదీ సందిగ్ధమే! ఈ ఆయిదేళ్లూ పూర్తయ్యాక మూడు రాజధానులని లేదా 30రాజధానులనీ ఎవరైనా అంటే అప్పటి మాటేమిటి? కనుక రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం తప్పనిసరి కర్తవ్యం. వారి సంగతి అలా ఉంటే మునిసిపల్ మంత్రి నారాయణ 'ప్రపంచంలోనే టాప్ ఐదు రాజధానుల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని' చెప్పడం వెనకటికెవరో 'మాఊరి మిరియాలు తాటి కాయలంత' అన్న చందంగా ఉంది. ప్రపంచంలో టాప్ సంగతి అటుంచి ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నరు వంటి భారత మహా నగరాల సరసన అమరావతి చేరగలదా? అంతెందుకు మన ఉమ్మడి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లేదా పొరుగునవున్న బెంగళూరు స్థాయికి చేరడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో కదా...!

# కొల్లేరు పక్షులను, ప్రజలనూ కాపాడుకోవాలి



ఆసియాలో పెద్దదైన సహజసిద్ధ మంచినీటి సరస్సు కొల్లేరు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నడుమ 10మండలాల్లో లోతట్టు గ్రామాలు (బెడ్) 46, చేర్చి ఉన్న గ్రామాలు (బెల్ట్) 74తో సహా 120 గ్రామాలలో 77 వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. 5 లక్షలకు పైగా జనాభా నివశిస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో అత్యధిక భాగం ఏలూరు జిల్లాకు వచ్చింది. వందల రకాల పక్షులు లక్షలాదిగా ఆవాసముంటున్నాయి. కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో వున్న సైబీరియా పక్షులు సైతం వలస వస్తుంటాయి.

అలాంటి కొల్లేరు నేడు కాలుష్యమయం అయింది. దీనికితోడు ఆక్వా మాఫియా కొల్లేరునంతా ఆక్రమించి చేపల చెరువులు తవ్వేసింది. దీంతో కొల్లేరు గమనానికి ఆటంకం ఏర్పడి బుడమేరు సైతం పొంగి విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. చిత్తడి నేలల పరిరక్షణ కరవైంది. పక్షులకు ఆవాసంగా ఉన్న కొల్లేరు అభయారణ్యం కనుమరుగౌతున్నది. లాభాలే పరమావధిగా ఉన్న పరిశ్రమల యజమానులు మురికి జలాల శుద్ధి ప్లాంటేషన్లు ఏర్పాటు చేయనందున, చేసినా నిర్వహించనందున వ్యర్థ జలాలు యథావిధిగా కొల్లేరులోకి వదులుతున్నారు. కొల్లేరు పరిసరాల్లోని ఆక్వా చెరువులో వాడే కోళ్ళ వ్యర్థాలు, జలాలు ఇందులోనే కలుస్తున్నాయి. ఈ కాలుష్యాన్ని అరికట్టే చర్యలు ఏ ప్రభుత్వాలూ తీసుకున్న దాఖలాలు లేవు. కొల్లేరు 3వ కాంటూరు పైబడి 40 వేల ఎకరాల భూములున్నాయి. వీటిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 146 సొసైటీల కింద 17 వేల ఎకరాలున్నా యి. మిగిలినవి పట్టా భూములు. కొల్లేరు ప్రజలు అత్యధికులు ఈ సొసైటీ భూములు లేదా జిరాయితీ భూములు ఎకరం నుండి అరెకరం కల్గినవారే అత్యధికులు. చేపల వేట, వ్యవసాయ కూలీ పనులతోపాటు ఈ భూముల్లో చేపల చెరువులే కొల్లేరు ప్రజలకు ఆధారం.

తమ రాజకీయ ప్రయోజనాల కోసం, పర్యావరణ పరిరక్షణ పేరుతో 2005లో నాటి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 120 జీవోనే ఈ పరిస్థితికి మూలమైంది. ఈ జీవో ఆధారంగా రాష్ట్రంలో కొందరు పర్యావరణ పరిరక్షణ కోసమంటూ సుప్రీం కోర్టుకెక్కారు. దీంతో సుప్రీంకోర్టు పర్యావరణ పరిరక్షణ, చిత్తడి నేలల పరిరక్షణకు యు.ఎన్.ఓ. తీర్మానం, పక్షుల పరిరక్షణ ఆధారంగా కొల్లేరులో 5వ కాంటూరులో ఆక్వా చెరువులు తొలగించాలి, అభయారణ్య నిబంధనలు కఠినంగా అమలు చేయాలని ఆదేశించింది. పదో కాంటూరు వరకు సున్నిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించాలని చెప్పింది. ఇది స్థానిక ప్రజల మనుగడకు ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల సందర్భంగా కొల్లేరును 3వ కాంటూరుకు కుదిస్తామని భీమవరం సభలో ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. గత అసెంబ్లీలో ఈ మేరకు తీర్మానం చేశారు. బాంబులతో చెరువుల తొలగింపు సందర్భంగా నాటి ముఖ్య మంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇవేవీ అమలుకు నోచుకోలేదు. 3వ కాంటూరుకు కుదించడమేలా ఉన్నా 10వ కాంటూరు వరకూ సున్నిత పర్యావరణ పరిరక్షణ ప్రాంతంగా విస్తరిస్తున్నారు. ఇందుకు ఎన్నికల ముందు, తర్వాత గ్రామ సభలు తూతూ మంత్రంగా జరిపారు. ఇదే జరిగితే ఏలూరు, ఆకివీడు పట్టణాలు సహా 89 గ్రామాలు మొత్తం అభయారణ్య నిబంధనల కిందకు వస్తాయి. అపుడు పూర్తిగా ప్రజల రోజువారీ జీవనమంతా అటవీశాఖ అధీనంలోకి వెళ్తోంది. అన్ని సందర్భాలలోనూ పాలక పార్టీలన్నీ కొల్లేరు ప్రజల పట్ల మోసపూరి తంగా వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజల పక్షం. అధికారంలో ఉంటే నిరంకుశత్వం లేదా మాయమాటలు, భ్రమలతో అప్పటికప్పుడు తాత్కాలికంగా గట్టెక్కించే చర్యలతో చేతులు దులుపు కుంటున్నారు. అన్ని సందర్భాల్లోనూ సిపిఎం శాస్త్రీయమైన, ప్రజల పరిరక్షణ వైఖరితో కొల్లేరు ప్రజలకు దన్నుగా నిలుస్తున్నది.

భారీ వర్షాల కాలంలో కొల్లేరే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా వరద ముంపు రాకుండా ఉండలన్నా, ప్రజలు, పక్షులు రక్షించబడాలన్నా ఇప్పటికే జస్టిస్ మిత్రా, శ్రీరామకృష్ణయ్య కమిటీలు లోతైన పరిశీలనతో తగు పరిష్కారాలు చెప్పాయి. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వాటిని అమలు చేయాలి. ఫ్యాక్టరీలు, మున్సిపాలిటీల వ్యర్థ జలాలు రాకుండా అరికట్టాలి. ఏరులు, కాల్వల పూడికలు తీసి, వెడల్పు చేయాలి. కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి.

ఆ ప్రాంతంలో పక్షుల పరిరక్షణకు, పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. 3వ కాంటూరుపైన ఉన్న భూముల్ని పేదలకు పంచాలి. జిరాయితీ, సొసైటీ భూముల్లో సాగుకు అనుమతించాలి. ఈ ప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీటి సరఫరాకు ప్రత్యేక వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయాలి. అన్ని గ్రామాల్లో రోడ్లు నిర్మించాలి. ఉపాధి హామీ పనులు ప్రత్యేకంగా 200 రోజులకు పెంచి అమలు చేసి కొల్లేరు ప్రజల్ని ఆదుకోవాలి. వీటన్నిటితోపాటు ప్రస్తుతం సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబ్యునల్‌లో సాగుతున్న వ్యాజ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతివాదులుగా చేరి ప్రజల పక్షాన మాట్లాడాలి. 3వ కాంటూరుకు కుదించేలా శాశ్వతంగా ఓ చట్టాన్ని తీసుకురావాలి. ఇందుకు కొల్లేరు ప్రజలు నాటి పోరాట స్ఫూర్తితో ఐక్యం కావాలి.

# నాణ్యంగా.. స్వచ్ఛంగా ఏసీ గాలి

## శుద్ధి చేసే టెక్నాలజీ అభివృద్ధి వినియోగిస్తున్న ఓ స్టార్టప్



న్యూఢిల్లీ: ఎయిర్ కండిషనర్ నుంచి వచ్చే గాలి నాణ్యతను మెరుగుపరచడంతోపాటు, ఏసీ మన్నిక, సమర్థతలను పెంచే ఎయిర్ ప్యూరిఫయర్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఈ సరికొత్త ఏసీ ఫిల్టరేషన్ టెక్నాలజీ పీఎం 2.5-పీఎం 1 వరకు కాలుష్య కారకా లను, అలర్జీ, వ్యాధుల కారకాలను అడ్డుకోగలదు. ఈ సాంకేతికతను ఐఐటీ-బాంబే అభివృద్ధి చేసింది. దీనిని ఏఐఆర్‌టీహెచ్ అనే స్టార్టప్ విజయవంతంగా పరీక్షించింది. మెరుగైన ఆరోగ్యం కోసం పరిశుభ్రమైన గాలిని ఈ ఏసీలు అందిస్తాయని ఆ కంపెనీ తెలిపింది. ఈ కొత్త సాంకేతికత కలిగిన ఏసీని నిరంతరాయంగా ఉపయోగించినపుడు, విద్యుత్తు వినియోగం సాధారణ ఏసీలతో పోల్చుకుంటే 13 శాతం తగ్గుతుందని సదరు కంపెనీ చెప్పింది. మూడు నెలల తర్వాత కూలింగ్ కెపాసిటీ నామమాత్రంగా 4 శాతం తగ్గుతుందని పేర్కొంది. ఈ టెక్నాలజీ ఏసీ ఫ్రెండ్లీ అని తెలిపింది. ఏఐఆర్‌టీహెచ్ ఏసీ ప్యూరిఫయర్‌ను అమర్చిన ఏసీ నుంచి వచ్చే గాలిని పరిశీలించినపుడు%ా%అది 1,500 సిగరెట్లు తక్కువగా కాల్చడంతో సమానమని వివరించింది. వినియోగదారుల ఊపిరితిత్తులను మాత్రమే కాకుండా, ఏసీని కూడా ఈ టెక్నాలజీ కాపాడుతుందని ఈ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ రవి కౌశిక్ చెప్పారు. ఆయన ఐఐటీ-బాంబేలో ఏరోసోల్ సైంటిస్ట్.

# శ్రమ జీవన సౌందర్యం

## ఇస్లాం బోధ



అన్నింటికంటే అత్యుత్తమ సంపాదన ఏదీ? అని ముహమ్మద్ (సఅసం)ను కొందరు సహచర మిత్రులు అడిగారు. 'తన స్వహస్తాలతో సంపాదించిన దానికంటే ఉత్తమమైన సంపాదన మరొకటి లేదు' అని చెప్పారు. ప్రవక్త చెప్పిన ఈ మాట శ్రమ శక్తి ఔన్నత్యాన్ని తెలి యజేస్తుంది. పనీపాటా లేకుండా తిరగడం ఇస్లాం స్ఫూర్తికి విరు ద్ధమైన విషయం. చాలామంది పని చేయకుండా, చేతులకు మట్టి అంటకుండా డబ్బు సంపాదించాలని అనుకుంటారు. సంపాదన కోసం దగ్గరి మార్గాలు వెతుక్కుంటారు. ప్రాపంచికంగా వారు తమ అవసరాలు తీర్చుకుంటారేమో కాని, ధార్మికంగా వాళ్లు విజయం సాధించలేరు. చాలా సంవత్సరాల క్రితం శ్రమ గొప్పతనాన్ని ముహమ్మద్ ప్రవక్త చాటి చెప్పారు. ఒకసారి ఒక సహచరుడు కట్టెలు కొట్టి కొట్టి చేతులు బొబ్బలెక్కాయి. ముహమ్మద్ ప్రవక్త (సఅసం) అతని చేతులను తన రెండు చేతులతో పట్టుకొని ముద్దాడారు. ఇలాంటి కష్టజీవులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని చెప్పారు. పని చిన్నదైనా, పెద్దదైనా పని పనే అవుతుంది. చేసే పనిని శ్రద్ధగా చేయాలి. స్వహస్తాలతో పనిచేసి సంపాదించడం పట్ల సిగ్గుపడాల్సిన పనేం లేదు. ఖాళీగా కాలక్షేపం చేయడం కంటే ఎప్పుడూ ఏదో ఒక పనిలో లీనమవడం ఉత్తమం. 'ఖాళీ మెదడు దెయ్యాల కొంప' అనే సామెత ఉండనే ఉన్నది.

ఏ పనీ లేనివారే పాపాలకు, నేరాలకు ఒడిగడుతుంటారు. పనుల్లో చిన్న పనులు, గొప్ప పనులనేమీ ఉండవు. ఎవరు చేసే పని వారికి గొప్ప. ప్రతీ ఒక్కరూ పనిచేసి సంపాదించి ఉపాధిని పొందడమే ఆత్మగౌరవం. అక్రమ మార్గాల ద్వారా ఆర్జించడం ధర్మ నిషేధం. అక్రమ మార్గాల ద్వారా పొట్టపోసు కున్న శరీరం నరకాగ్నిలో కాలిపోతుందని ప్రవక్త హెచ్చరిక.

# ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్ లకు కృతజ్ఞతలు తెలిపిన విడిసి, ఎండిసి

**బుగ్గారం,తెలంగాణ దిశ:**జగిత్యాల జిల్లాలో బుగ్గారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ మండలంగా గుర్తించి రెవెన్యూ సదస్సులు ప్రారంభించినందులకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ కు, ఇతర అధికారులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు బుగ్గారం విడిసి, ఎండిసిలు కృతజ్ఞతలు తెలిపాయి. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నక్క చంద్రమౌళి అధ్యక్షతన మండల కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కమిటి కన్వీనర్ చుక్క గంగారెడ్డి మాట్లాడుతూ రైతులు ఇట్టి గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ లు మండలాన్ని పైలెట్ మండలంగా గుర్తించడం హర్షణీయం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం, ఎమ్మెల్యేలు ఏక తాటితో వ్యవహరించి రైతుల సమస్యలను, ప్రజల సమస్యలను అర్థం చేసుకొని ఎంతో ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని తెరపైకి తేవడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం నేటి నుండి ఈ నెల 16 వరకు జరిగే రెవెన్యూ సదస్సులకు రైతులు, ప్రజలు తగిన ఆధారాలతో సహా హాజరై మీకున్న భూ సమస్యలపై విజ్ఞాపన పత్రాలు అందజేయాలన్నారు.



నిరక్షరాస్యులైన రైతులకు ఆయా గ్రామాల్లోని యువత సహకరించి దరఖాస్తులు వ్రాసి ఇవ్వాలని కోరారు. బుగ్గారం మండలంలో వందకు - వంద శాతం భూ సమస్యలు తొలగించే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో ఎండిసి కో-కన్వీనర్ పెద్దనవేణి రాగన్న, విడిసి సభ్యులు, మాజీ ఎంపీటీసీ నగునూరి చిన్న రామాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ పెద్ద రామ గౌడ్, కోడిమ్యాల రాజన్న, పెరంభూదూరి రామకృష్ణ స్వామి, పరమాల మల్లయ్య, సిరికొండ గంగన్న, ఆకుల రాజన్న, పచ్చిమట్ల సత్తన్న తదితరులు పాల్గొన్నారు

# క్రీడాకారులకు ప్రోత్సాహమే ధ్యేయంగా క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

## నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

**విశాఖపట్నం,తెలంగాణ దిశ:** క్రీడలకు విశాఖ నగరం ఎంతో అనుకూలమైనదని, క్రీడల అభివృద్ధికి జీవీఎంసీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, క్రీడాకారులకు, క్రీడలకు తన సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తానని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెందుర్తి లోని మేయర్ స్వగృహంలో విశాఖ నగరానికి చెందిన 13 సంవత్సరాల అంతర్జాతీయ క్రీడాకారిణి శ్రీ సాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించినందుకు మేయర్ ఆమెను అభినందించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదని ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో వారి ప్రతిభను చాటుకున్నారని అలాగే శ్రీసాహితి

రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. ఇంత ఘనత సాధించి ప్రతిభ కనబరిచిన శ్రీసాహితి కు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, జీవీఎంసీ తరపున సహాయ

సహకారాలు క్రీడలకు అందిస్తానని,విద్యార్థులు నగరంలో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించి విశాఖ నగర కీర్తిని మరింత పెంచి నగరానికి ఘనతను సాధించి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని తెలిపారు.

# అడ్డగోలు నిర్మాణాలు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించి ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఇదే అదనుగా భావించి సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలను, భవనాలను ఏర్పాటు చేసుకొని దర్జాగా లబ్ధిపొందుతున్నారు.. దీనిని నివారించాల్సిన గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో ఊగిపోతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు...పైగా రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ దర్జాగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలు, భవనాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఇదేమిటని అడిగే నాథుడు లేకపోవడంతో వారు అడిందే ఆట పాడిందే పాటలా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే..కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్ గ్రామ శివారులోని గేట్ వద్ద సర్వే నం బర్ 54లో గల ప్రభుత్వ భూమిని గతంలో వీరేశం యాదవ్ అనే వ్యక్తికి సాగు చేసుకోవడానికి కొంత భూమిని కేటాయించారు. కాగా గత నాలుగైదు సంవత్సరాల క్రితం సదరు లబ్ధిదారుడు ఆ భూమిని సాగు చేయకుండా ఆ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా భవనం నిర్మించుకున్నారు. అంతేగాకుండా రేకులతో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయికి ఇవ్వడం జరిగింది. ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు కూడా తీసుకోకుండా తనను అడిగేవారు లేరంటూ దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు తగ్గట్టు సంబంధిత అధికా రులు సైతం అతనికే వత్తాసు పలకడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. ప్రభుత్వం కేటాయించిన భూమిలో కేవ లం సాగు మాత్రమే చేసుకోవాలనేది నిబంధన. ఒకవేళ లబ్ధిదారుడు సాగు చేసుకోని పక్షంలో ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవాలి. కానీ ఇక్కడ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో సద రు లబ్ధిదారుడు దర్జాగా భవనాన్ని నిర్మించడమే కాకుండా వాణిజ్య దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని కావల్సినంత రాబడి పొందుతున్నాడు.ప్రభుత్వ భూమి లో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎందుకని ఆరా తీస్తే కిందిస్థాయి నుండి ఎమ్మెల్యే వరకు అండదండలు ఉన్నాయని అధికారులే చెప్ప డం విశేషం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన అతనిపై చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదుపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసు కోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మామూళ్ళకు తలొగ్గి అక్రమ నిర్మా ణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు నేరం..: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసినట్లు మా దృష్టికి రాలేదు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అయినా ప్ర భుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపారం చేసిన వారిపైతగు చర్యలు తీసుకుంటాంనోటీసులు జారీ చేస్తాంసర్వే నంబర్ 54లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన విషయంలో విచారణ చేపడుతున్నాం. వీరేశం యాదవ్కు నోటీసులు జారీ చేస్తాం. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎమ్మెల్యే..




జైపూర్: అసెంబ్లీలో ప్రశ్నలు అడగకుండా ఉండటానికి లంచం తీసుకున్న కేసులో రాజస్థాన్ ఎమ్మెల్యే అరెస్టయ్యారు. బాగిడోరాకు చెందిన భారత్ ఆదివాసీ పార్టీ ఎమ్మెల్యే జైకృష్ణ పటేల్ అసెంబ్లీలో మైనింగ్ సంబంధించి మూడు ప్రశ్నలు అడిగేందుకు సిద్ధమయ్యారు. అయితే వాటిని తొలగించేందుకు సంబంధిత మైనింగ్ కంపెనీ ఎమ్మెల్యేను సంప్రదించింది. దీనికిగాను జైకృష్ణ రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. అయితే అది రూ.2.5 కోట్లకుఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో తొలుత సంబంధిత కంపెనీ అతనికి రూ.లక్ష అందించింది. రెండో విడుతలో భాగంగా రూ.20 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో అధికారులు ఎమ్మెల్యేకు ఉచ్చు బిగించారు. ఈ క్రమంలో డబ్బు ఇచ్చేందుకు జైపూర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని సంబంధిత వ్యక్తులకు ఎమ్మెల్యే జైకృష్ణ సూచించారు. దీంతో వారు ఆయన క్వార్టర్స్‌లో రూ.20 లక్షలు అందించారు. ఆ మొత్తాన్ని స్వయంగా లెక్కించిన తర్వాత ఆయన తన సహాయకుడితో పంపించారు. ఇంతలో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎమ్మెల్యేను అరెస్టు చేశారు. అయితే అప్పటికే ఆ వ్యక్తి బ్యాగుతో అక్కడినుంచి పరారయ్యాడు. దీంతో అతనికోసం గాలిస్తున్నారు. కాగా, లంచం తీసుకుంటుండగా ఓ ఎమ్మెల్యే పట్టుబడటం రాష్ట్ర ఏసీబీ చరిత్రలో ఇదే మొదటి సారని ఏసీబీ డీజీ రవిప్రకాశ్ మెహ్రాదా చెప్పారు. రవీంద్ర సింగ్ అనే వ్యక్తి ఏప్రిల్ 4న తమకు ఫిర్యాదు చేశారని చెప్పారు. అప్పటి నుంచి ఎమ్మెల్యేను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మైనింగ్‌కు సంబంధించి అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన మూడు ప్రశ్నలను తొలగించడానికి.. ఎమ్మెల్యే మొదట రూ.10 కోట్లు అడిగారని, కానీ తరువాత రూ.2.5 కోట్లకు ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. లంచం మొత్తాన్ని విడతలవారీగా చెల్లించాలని నిర్ణయించారని, ఇందులో భాగంగా రూ.20 లక్షలు తీసుకుంటుండగా ఎమ్మెల్యేను పట్టుకున్నామని చెప్పారు. ఏసీబీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేసరికి ఎమ్మెల్యే సహచరులలో ఒకరు డబ్బుతో పారిపోయారని తెలిపారు. అయితే తాము అప్పటికే అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో ఈ వ్యవహారమంతా రికార్డయిందని, ఎమ్మెల్యే డబ్బు తీసుకుంటున్న ఆడియో, వీడియో రికార్డింగ్ తమ వద్ద ఉన్నదని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బాగిడోరా నియోజకవర్గం నుంచి గెలుపుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మహేంద్రజిత్ మాల్వియా బీజేపీలో చేరారు. అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో జరిగిన ఉప ఎన్నికల్లో జైకృష్ణ పటేల్ బీజేపీ అభ్యర్థి సుభాష్ తంబోలియాపై 51 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు.



### ప్రభుత్వాల విధానాలతో..

# ఉక్కిరిబిక్కిరి అవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

## -పెరుగుతున్న ఖర్చులు
## -తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మధ్యతరగతి నేడు కొనుగోలు తగ్గించుకుంటున్నది. గత అనేక దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన నిర్ణయాలను తీవ్రంగా ప్రభావితం చేసిన ఈ వర్గం నేడు ఆ ప్రభుత్వాల విధానాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. పెరుగుతున్న ఖర్చులు-తరుగుతున్న ఆదాయాలతో ఆందోళన చెందుతున్నది. తమ గురించి, తమ పిల్లల భవిష్యత్ గురించి వేదనకు గురౌతున్నది. తమ దగ్గర వున్న కొద్దిపాటి డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నది. వీటన్నిటి ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారం, సరుకులు, వాహనాల కొనుగోలు రూపాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ తరగతితో శక్తికి మించి అప్పులు చేయించి లాభపడిన వ్యాపార సంస్థలు నేడు వ్యాపార లావాదేవీలు తగ్గిపోయాయని గగ్గోలు పెడుతున్నాయి. ఈ స్థితి నుండి తమను పాలకులు బయట వేస్తారనే విశ్వాసం కోల్పోయి, అతీతశక్తులను ఆరాధించడం పెరిగింది. గత మూడు దశాబ్దాల్లో ప్రపంచీకరణ విధానాలతో వేగంగా విస్తరించిన మధ్యతరగతి నేడు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల వల్ల తీవ్ర ఆందోళనకు గురౌతున్నది.

ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా ప్రకారం, రాబోయే పది సంవత్సరాల్లో మన దేశంలో మధ్యతరగతి కుటుంబాలు రెట్టింపు అవుతాయి. 2024లో 35 కోట్లుగా వున్న ఈ తరగతి 2034 నాటికి 69 కోట్లకు పెరుగుతుందని తెలిపింది. అందుకే దేశాభివృద్ధిలో ఈ తరగతి వినిమయం చాలా కీలకమవుతుంది. కార్పొరేట్ వ్యాపార సంస్థలు వీరిని ఆకర్షించి వ్యాపారాన్ని పెంచుకోవడానికి, ఊహల పల్లకిలో పెట్టి పాలకులు లాభపడడానికి, అసత్యాలు, అర్ధసత్యాలతో సంచలనాత్మక ప్రసారాలతో రేటింగ్ పెంచుకోవడానికి మీడియా నిత్యం అనేక ప్రయత్నాలు చేస్తుంటుంది. తమ అభివృద్ధికి అమెరికా డాలర్లను కొలమానంగా భావించే కొద్దిమంది మధ్యతరగతి వారు తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు ట్రంప్ విధానాలతో భయాందోళన చెందుతున్నారు. దేశంలో 11 సంవత్సరాలుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకపోవడం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం, ధరలు పెరగడంతో మధ్యతరగతి ఖర్చు చేయడానికి భయపడుతుంది. తమ ఆదాయంలో ఎక్కువ భాగం అప్పుల వడ్డీలు, ఇఎంఐ లు చెల్లించడానికే సరిపోయే స్థితికి చేరింది. గత 25 సంవత్సరాల్లో వస్తువుల వాడకం, గృహ నిర్మాణం ద్వారా విస్తరించిన వినిమయ మార్కెట్ నేడు మందగించింది. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలోని మొత్తం కుటుంబాల్లో 67 శాతం మంది వ్యక్తిగత రుణాలు తీసుకున్నారని, వీరిలో 53 శాతం మంది 30 ఏళ్ళ లోపు వారని తెలిపింది. ఇందులో అత్యధికులు ఐటి ఉద్యోగులు. వీరే నయా మధ్యతరగతివారు. రేపు లేదన్నట్లు ఖర్చు చేయగల ఖరీదైన వినిమయదారులు. రిజర్వుబ్యాంకు రిపోర్టు ప్రకారం 2018లో మధ్యతరగతి వారు తమ ఆదాయంలో 30.4 శాతం అప్పుల చెల్లింపులకు ఖర్చు చేస్తుండగా, నేడు సుమారు 41 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున అప్పుల చెల్లింపులు వుండడంతో కొత్త సరుకులను కొనడం పట్ల ఆసక్తి చూపడంలేదు. దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థ మీద తీవ్రంగా ఉంది. తయారీ రంగం విస్తరించక పోవడం, కొత్త ఉ పాధి అవకాశాలు తగ్గడం, మధ్యతరహా వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ లాంటి రంగాలు కష్టాల్లో కూరుకుపోయాయి.

హిందుస్తాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా సంస్థలు పట్టణాల్లో కొనుగోలు తమ అంచనాల కంటే ఎక్కువగా తగ్గిందని ప్రకటించాయి. దేశంలో అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ పట్టణాల్లో తమ అమ్మకాలు 2 శాతం తగ్గాయని ప్రకటించింది. ఈ సంవత్సరం జనవరి నుండి, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 9 శాతం తగ్గాయి. మోటార్ సైకిల్ అమ్మకాలు 13 శాతం, మోపెడ్ అమ్మకాలు 18 శాతం తగ్గాయి. నెస్లే ఇండియా ప్రతినిధి సురేష్ నారాయణన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అమ్మకాలు మందగించడం వెనుక 'తగ్గుతున్న మధ్యతరగతి' ఒక ముఖ్య కారణంగా చెప్పారు. 'ఒకప్పుడు రెండంకె లుగా ఉన్న ఆహార, పానీయాల రంగంలో వృద్ధి ఇప్పుడు 1.5 నుండి 2 శాతానికి పడిపోయింది' అని ఆయన పేర్కొన్నారు. నెలకు రూ. 40,000 నుండి రూ.55,000 వరకు సంపాదించే వారు ఒక్కొక్కరు 5-6 రకాల రుణాలు రూ.6 లక్షల నుండి రూ.30 లక్షల వరకు తీసుకుంటున్నట్లు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నివేదిక తెలిపింది. వీరు పొందుతున్న ఆదాయంలో సుమారు 50 శాతం పైగా వడ్డీల చెల్లిం పులకే సరిపోతుందట!

దిగువ మధ్యతరగతి తమ దగ్గర వున్న బంగారా న్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడం పెరిగింది. ఈ తరహారుణాలు 2024-25ఆర్థిక సంవత్సరంలోనే71 శాతం పెరిగా యి. అంతకు ముందు సంవత్సరంలో 17 శాతం పెరిగాయి.

మార్చి 2020లో అప్పుల్లో వున్న కుటుంబాలు దేశ జాతీ యోత్పత్తిలో 35 శాతం వుండగా, జూన్ 2024నాటికి 43శాతాని కిపెరిగాయని రిజర్వు బ్యాంకు తెలిపింది. ఒకవైపు మధ్యతరగతి వాస్తవ పరిస్థితి దిగజారు తుంటే దేశ తలసరి ఆదాయం 2,841 డాలర్లు (సుమారు రూ. 2,52,000) కు చేరుకుందని, 2047నాటికి రూ.15లక్షలకు చేరుకుం టుందని ప్రధాని ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ ప్రకటిస్తున్నారు.

స్వాతంత్ర్యానంతరం అనుసరించిన విధానాల ఫలితంగా దేశంలో 1900 సంస్థలను ప్రభుత్వ రంగం నిర్వహించింది. ఇందులో లక్షల మంది ఉద్యోగాలు పొందారు. రైల్వే, రోడ్లు, ఓడరేవులు, ఇనుము, ఉక్కు, అల్యూమినియం, రెవిన్యూ, రక్షణ, శాంతిభద్రతలు, విద్యా, వైద్యం, పోస్టల్, టెలికం లాంటి అనేక ప్రజా సర్వీసులు ఇలా అనేక రంగాలను ప్రభుత్వం నిర్వహించింది. వీటితో పాటు ప్రాజెక్టులు, మందులు, ఎరువుల పరిశ్రమలను ప్రభుత్వమే స్థాపించింది. బ్యాంకు, ఇన్సూరెన్స్‌లను జాతీయం చేసుకుంది. వీటన్నిటివల్ల స్థిరమైన వేతనాలు, చౌకగా విద్య, వైద్యం, రవాణా, గృహ వసతి లాంటి సదుపాయాలు పొందిన మధ్యతరగతి విస్తరించింది. వారి కొనుగోలు శక్తి పెరిగింది. ఇందుకు అవసరమైన సరుకులను ఉత్పత్తి చేయడం కాకుండా దిగుమతి చేసుకోవడంతో 1990 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. దీనికి పరిష్కారం సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలను ఆచరించడమేనని గత ముప్పై సంవత్సరాలుగా పాలకులు చెబుతూ వచ్చారు. నేడు మధ్యతరగతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ మూడు విధానాలే కారణం. 1991 తర్వాత అనుసరించిన ఆర్థిక విధానాల వల్ల ఈ తరగతి వేగంగా విస్తరించింది. ఈ తరగతి అభివృద్ధిలో అప్పటి వరకు కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరిస్తూ, ప్రైవేటు రంగంలోని సర్వీసు రంగాల లాంటి వాటి ద్వారా అభివృద్ధి సాధించాలనుకోవడం ఇందులోని తీవ్ర వైరుధ్యం. కొత్త రంగాల్లో వేతనాల్లో పెరుగుదల వున్నప్పటికీ అంతకు ముందు పొందిన అనేక రకాల సేవలు, భద్రత సదుపాయాలు కోల్పోయారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపార సంస్థలు ఈ నయా మధ్యతరగతిలో విపరీతమైన వస్తు వ్యామోహాన్ని పెంచాయి. భద్రతతో కూడిన స్థిరమైన ఆదాయం లేకుండానే కృత్రిమ వినిమయంతో, అలవాట్లను మార్చగలిగాయి. తమను తాము ఉన్నత తరగతివారు ఏడు రూపాల్లో ప్రదర్శించుకుంటున్నారని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అవి, అవసరాలతో సంబంధం లేకుండా కొత్త వస్తువులను యథేచ్ఛగా కొనడం, ఆధునిక గృహ నిర్మాణాలు, అందులో అతి ఖరీదైన వస్తువులు ఏర్పాటు చేయడం పెరిగింది (హౌసింగ్ రుణాలు 2023లో 37.9 శాతం నుండి 2024లో 41, 2025 మొదటి అర్ధ భాగంలో 43.5 శాతానికి పెరిగాయి.). దేశీయ, విదేశీ విహారయాత్రలు, ఖరీదైన బ్రాండ్ వస్తువులు, దుస్తులు, కార్లు కొనడం, రెగ్యులర్‌గా హోటళ్లకు, రెస్టారెంట్లకు వెళ్లడం హోదాగా భావించడం, ఆధునిక వంటలు, ఖరీదైన విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చడం, మర్యాదల పేరుతో పెళ్ళిళ్లు, రకరకాల ఫంక్షన్‌లకు భారీగా ఖర్చులు చేసే సంస్కృతి పెరిగింది. వీరి వల్ల నగరాలు, పట్టణాల్లో రియల్ ఎస్టేట్ రంగంతో పాటు, కార్పొరేట్ విద్యాలయాలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, వాహనాల షోరూంలు ఈ కాలంలో బాగా విస్తరించాయి. వీటన్నింటికి అవసరమైన డబ్బును వేతనాల ద్వారా పొందలేరు కాబట్టి సులభంగా రుణాలు ఇచ్చే పద్ధతులను ఫైనాన్స్ సంస్థలు అనుసరించాయి. వ్యక్తిగత జీవిత అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. వ్యసనాలు కూడా హోదాగా మారాయి. కుటుంబ విలువలుగా ఇన్నేళ్లు కీర్తించబడినవన్నీ ఛిద్రం అవుతున్నాయి.

అమెరికాలో 2008లో ప్రారంభమై ప్రపంచమంతా విస్తరించిన ఆర్థిక సంక్షోభం, ఆ తర్వాత కరోనాతో ఈ కృత్రిమ వినిమయానికి బ్రేకులు పడ్డాయి. గతంలో పొందిన వేతనాలు తగ్గాయి. గత సంవత్సరంతో పోలిస్తే 23 శాతం మందికి వేతనాలు తగ్గినట్లు వినిమయ సర్వే సంస్థలు ప్రకటించాయి. మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ నివేదిక ప్రకారం, ఆర్థిక మందగమనం మూడు రూపాల్లో స్పష్టంగా వ్యక్తమవుతుందని తెలిపింది. ఒకటి సాంకేతిక అభివృద్ధి (ఎ.ఐ), రెండు తీవ్రమవుతున్న ఆర్థిక మాంద్యం, మూడు క్షీణిస్తున్న ఆదాయం. ఇప్పుడు ఆటోమేషన్, టెక్నాలజీ ద్వారా అనేక ఉద్యోగాలు భర్తీ చేయబడుతున్నాయి.

కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో క్లరికల్ పోస్టులు గణనీయంగా తగ్గాయి. ఔట్‌సోర్సింగ్, ఆటోమేషన్ వంటి వాటికి ఖర్చు తగ్గించాలని యాజమాన్యాలు తీసుకున్న చర్యల వల్ల అనేక మందికి ఉపాధి తగ్గిపోయిందని జాతీయ గణాంక కమిషన్ మాజీ చైర్మన్ పి.సి మోహన్ పేర్కొన్నారు. దేశ వినిమయంలో కీలకమైన ఐటి రంగంలోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్ళకు గురౌతున్నారు. వేతనాల పెరుగుదల సరిగా లేకపోవడం, ఉద్యోగాల తొలగింపు,గతంలో వున్న కొద్దిపాటి ఆరోగ్య, రుణ సదుపాయాల వంటివి రద్దు కావడం, పని గంటలు పెంచాలనే యాజమాన్య డిమాండ్‌లతో వీరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ దగ్గరవున్న కొద్దిపాటి డబ్బును గతంలాగా ఖర్చు చేయడానికి సిద్ధపడడం లేదు. బ్లూవెంచర్స్ సంస్థ దేశంలోని 30 కోట్ల మంది మధ్యతరగతి వారు తమ డబ్బును ఖర్చు చేయడానికి భయపడుతున్నారని తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా వున్న మధ్యతరగతి ఇంత ఒత్తిళ్ళను ఎదుర్కొంటుంటే దేశ పాలకుల్లో కనీస చలనం వున్నట్లు కనిపించడంలేదు. దేశానికి వినాశకరమైన రెండు విధానాలను అనుసరిస్తున్నారు.ఒకటి, కార్మిక చట్టాలను కాలరాచి, సహజ వనరులను, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, రెండు, వీటిని ప్రశ్నించకుండా ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టడం. వీటిని ప్రశ్నించకుండా దేశాభివృద్ధి గురించి మాట్లాడలేం.



### తుంపర సేద్యం..

# మెట్ట రైతుకు లాభం..

## - డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు
## - ఆరుతడి పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకంపై రైతుల ఆసక్తి
## - అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారుల
## - సూచన సూక్ష్మ, తుంపర సేద్యంతో సాగునీరు, శ్రమ ఆదా..

**హుస్నాబాద్,తెలంగాణ దిశ: వ్యవసాయరంగంలో రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటి వనరులు ఉన్న హుస్నాబాద్ వంటి మెట్ట ప్రాంతాల్లో డ్రిప్, తుంపర సేద్యం వైపు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్ల) ద్వారా రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.**

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయ చేయడం, తక్కువ ఖర్చు, శ్రమతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసుకునేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, బబ్బెర, కందులు, పెసర, పత్తి, పలు కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తుంపర సేద్యం డ్రిప్, స్ప్రింక్లర్ల వాడకం ముఖ్యమైనవిగా చెప్పొచ్చు. డ్రిప్ విధానంలో పంటలోని ప్రతి సాలుకు సన్నని పైపు అమర్చి ఒక్కో చుక్క నీరు మొక్క మొదలులో పడేలా చేయడం, స్ప్రింక్లర్ల విధానంలో పంటలో పెద్ద పైపులు వేసి స్ప్రింక్లర్ హెడ్ ద్వారా నీటిని విరజిమ్మి పంటకు నీరందించడం జరుగుతుంది.

**తక్కువ ఖర్చుతోనే స్ప్రింక్లర్ల ఏర్పాటు:** తుంపర సేద్యంలో భాగంగా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఖర్చు కూడా తక్కువే అని చెప్పొచ్చు. ఎకరం భూమిలో పంట సాగు కోసం స్ప్రింక్లర్ల పైపులు కొనుగోలు చేసేందుకు రూ.5వేల నుంచి రూ.5,600ల వరకు ఖర్చవుతుంది. రెండు ఎకరాలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు, మూడు ఎకరాలకు రూ.9వేల నుంచి రూ.10వేల వరకు, నాలుగు ఎకరాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు ఖర్చవుతుంది. పైపుల సైజులను బట్టి ఖర్చులోనూ తేడాలు ఉంటాయి. అయితే రైతులు కొనుగోలు చేసిన స్ప్రింక్లర్ పైపులు, హెడ్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే ఎక్కువ రోజులు ఎలాంటి అవాంతరం లేకుండా పంటలను నీటిని అందించవచ్చు. స్ప్రింక్లర్లలో ఇంపాక్ట్ స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్స్, పార్ట్ సర్కిల్ స్ప్రింక్లర్స్, పర్‌ఫోరేటెడ్ పైపులు, జెట్ స్ప్రింక్లర్స్, పాపప్ స్ప్రింకర్స్, రెగ్యులేటెడ్ స్ప్రింక్లర్స్ తదితర రకాలు ఉంటాయి.

**స్ప్రింక్లర్ల అమరికలో మూడు విధానాలు:** స్ప్రింక్లర్లను మూడు విధాలుగా పంట పొలాల్లో అమర్చుకునే అవకాశం ఉంది. శాశ్వతంగా పైపులను భూమిలో పాతిపెట్టి స్ప్రింక్లర్ హెడ్‌లను అమర్చి నీటిని విరజిమ్మడం మొదటి విధానం అయితే కొన్ని పైపులను మాత్రం భూమి లోపల ఉంచి మిగతా పరికరాలను బయట ఉంచి మొక్కలన్నింటికీ తుంపర్లు పడేలా అమర్చుకోవడం రెండో విధానం. ఇక స్ప్రింక్లర్ పైపులన్నీ భూమిపైనే ఉంచి పంటకు నీరందించడం మూడో విధానంగా చెప్పొచ్చు. ఈ విధానం ద్వారా పైపులను ఒకచోట నుంచి మరో చోటికి తరలించి వీలైనన్నీ పంటలకు తుంపరసేద్యం ద్వారా నీరందించేందుకు వీలవుతుంది. స్ప్రింక్లర్‌లో ముఖ్యమైనది స్ప్రింక్లర్ హెడ్. ఇందులో రెండు రంధ్రాలు ఉంటాయి. ఒకటి 4 నుంచి 5.6మిల్లీమీటర్ల సైజు ఉండగా ఇంకోటి 3.13 మిల్లీమీటర్ల సైజు ఉంటుంది. ఎక్కువ పీడనం గల స్ప్రింక్లర్ సుమారు 35 మీటర్ల వ్యాసం కలిగిన భూమిని తడుపుతుంది. తక్కువ పీడనం గల స్ప్రింక్లర్ 30మీటర్ల వ్యాసం గల భూమిని మాత్రమే తడుపుతుంది.

**బిందు, తుంపర సేద్యం వల్ల కలిగే లాభాలు:** తుంపర సేద్యం విధానంలో పంట పొలంలో పొలం గట్లు, కాల్వలు, మడులు చేయాల్సిన అవసరం ఉండదు. దీంతో రైతుకు ఉన్న భూమి విస్తీర్ణం మొత్తం పంట సాగు చేయవచ్చు. సంప్రదాయ నీటి పారకం విధానంతో పొలం గట్లు, కాల్వ గట్లకు సుమారు 35శాతం నీరు వృథాగా పోతుంది. స్ప్రింక్లర్ల వాడకంలో ఈ నష్టం ఏమాత్రం ఉండదు. రైతు సాగు చేసిన పంటకు నీటిని తరచూ అవసరమైన పరిమాణంలో ఇవ్వడం వల్ల పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా సాధారణం కంటే 5 నుంచి 20 శాతం వరకు అదనంగా వస్తాయి. స్ప్రింక్లర్ పద్ధతి ద్వారా భూమి లోపలి పొరల్లోకి నీరు వెళ్లకుండా మొక్కల వేళ్ల వరకే వెళ్లి మొక్కకు కావాల్సిన నీరు అందుతుంది. ముఖ్యంగా ఇసుక నేలల్లో ఈ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. మొక్కలకు అవసరమైన నీటిని ఎక్కువసార్లు తక్కువ మోతాదులో ఇవ్వొచ్చు. స్ప్రింక్లర్ల నుంచి వెలువడే మృదువైన నీటి తుంపర్ల వల్ల భూమిపై నీరు నిల్వ ఉండదు, మట్టి గడ్డ కట్టదు. అవసరమైన నిష్పత్తిలో నీరు, గాలి భూమిలో ఉంటూ విత్తనాలు ఆరోగ్యంగా మొలకెత్తి పంట దిగుబడి కూడా పెరుగుతుంది. తుం పర సేద్యం ద్వారాఎగుడు, దిగుడుగా ఉన్న నేలల్లోనూ పంటలు పండించొచ్చు. స్ప్రింక్లర్ ద్వారా నీరు వర్షంలా పడటంతోపంటచుట్టుపక్కల వాతావరణం చల్లగా మారిఅధిక ఉష్ణోగ్రతలనుంచి పంటను కాపాడుకోవచ్చు. డ్రిప్ సిస్టం ద్వారా పలు రకాల పండ్లతో టలను విరివిగా పెంచుకునే అవకాశం ఉంది. బిందు సేద్యం(డ్రిప్) వల్ల 30నుంచి 40శాతం కరెంట్, 30నుంచి 40 శాతం ఎరువులు ఆదా అవుతాయి. ఎత్తు పల్లాలు ఉన్న భూముల్లోనూ అన్ని మొక్కలకుఒకే మోతాదులో నీరు అందడం వల్ల పంట ఏపుగా పెరుగుతుంది. బిందుసేద్యంతో భూమి కోతకు గురికాకుండా, భూసారం కోల్పోకుండా, పంటకు చీడపీడలు రాకుండా ఉంటుంది.



## పట్టుకోండి చూద్దాం...

**నెల్లూరు,,తెలంగాణ దిశ:**కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏప్రిల్ మూడో తేదీన ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన మాత్రం దొరకడం లేదు. హైకోర్టులో కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో ఆయన అప్పటి నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఏడు బృందాలు పోలీసులు నిరంతరం గాలిస్తున్నాయి. ఎక్కడా ఆయన ఆచూకీ దొరకడం లేదు. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి కనిపెట్టలేకపోవడంతో పోలీసులపై ప్రభుత్వం పెద్దలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు నెల రోజుల నుంచి కాకాణి తప్పించుకుతిరుగుతున్న పట్టుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసుల విచారణకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. హైకోర్టులో కూడా ఆయనకు ముందస్తు బెయిల్ రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి తప్పించుకుతిరుగుతుండటంతో నెల్లూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. ఎస్టీ, ఎస్టీ కేసు కూడా నమోదయింది. విచారణకు హాజరు కాకుండా ఉన్న కాకాణిని ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నిమార్లు ఇంటికి వెళ్లినా కుటుంబ సభ్యుల నుంచి మాత్రం ఒకటే సమాధానం. తమకు తెలియదని, కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో పాటు ఆయన ఎక్కడకు వెళ్లారన్నది అర్థం కాకుండా ఉంది. పోలీసులు అన్ని రకాలుగా నిఘా పెట్టారు. కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన సన్నిహితుల పై కూడా కన్నేసి ఉంచారు. వారి ఫోన్లను కూడా ట్రాప్ చేస్తున్నారు. అయినా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాత్రంఎవరికీ ఫోన్లు చేయడం లేదు. ఇలా దాదాపు నెల రోజుల నుంచి పోలీసుల కళ్లుగప్పితప్పించుకుని తిరుగుతుం డటం పోలీసులకు సవాల్ గా మారింది. అనుమానం వచ్చిన అన్ని ప్రదేశాల్లో వెదుకుతున్నా ఆయన ఆచూకీ ఇసుమంత కూడా దొరకకపోవడంతో ఉన్నతాధికారుల చేత చీవాట్లు తింటున్నారు. మొత్తం మీద కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసులకు చిక్కడు దొరకడు అన్న రీతిలో తప్పించుకుతిరుగుతున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు.

# సరిహద్దు చెంత కన్నీటి కథలు ..!



పహల్గామ్‌లో జరిగిన ఘోరం ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. బాధితులకు తీరని శోకం మిగిల్చిన ఈ దుశ్చర్యని ప్రజలందరూ తీవ్రంగా ఖండిం చారు. దు:ఖం, ఆవేదన ఒక్కసారే చుట్టుముట్టిన మృతుల కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. అయితే ఇదంతా ఘటనకి ఒకవైపు పార్శ్వం. ఇప్పుడు ఘటనకి రెండో పార్శ్వం గురించి చర్చించు కోవాలి. 'దాయాది దేశం అండతోనే దుండగులు ఈ దుశ్చర్యకి పాల్పడ్డారు కాబట్టి, భారత్‌లో ఉన్న పాకిస్తానీయులు గంటల వ్యవధిలో ఈ దేశం విడిచి పోవాలని పాలకులు హుకుం జారీచేశారు. సరిహద్దు మూసేసిన తరువాత ఈ దేశంలో ఇంకా ఉన్నట్లైతే జరిమానాతో కూడిన శిక్ష విధిస్తామ'ని తెగేసి చెప్పారు. ఈ ఆదేశం ఇప్పుడు వేలాది కుటుంబాలను విచ్ఛిన్నం చేసింది.

ఒకప్పుడు వాఘా సరిహద్దు ఇరు దేశాల మధ్య మిత్రబంధాన్ని పెంచితే ఇప్పుడు అదే సరిహద్దు తల్లిని పిల్లలకు దూరం చేసింది. భార్యభర్తలని విడదీసింది. అనారోగ్యం పాలైన అభాగ్యులకు వైద్యం అందకుండా వెనక్కి పంపేసింది. కళ్ల నిండా నీళ్లతో, దు:ఖాన్ని దిగమింగుకుంటూ వాఘా సరిహద్దు వద్ద బారులు తీరిన లైన్లలో ఎందరో అమ్మలు, బిడ్డలు, ఆలుమగలు అక్కడ కనిపించారు. ఒక్కొక్కరిది ఒక్కో విషాదకథ. గుండెని పిండేసే వ్యథ..

సనా భారతీయురాలు. 2020లో తన అత్త కొడుకు పాకిస్తాన్ కరాచీలో ఉంటున్న పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఆ దంపతులకు ఇద్దరు బిడ్డలు. మూడేళ్ల ముస్తఫా, ఏడాదిన్నర వయసున్న మహనూర్. ఏప్రిల్ 14న సనా, మీరట్‌లో ఉంటున్న తన పుట్టింటికి పిల్లలతో కలసివచ్చింది. పెళ్లయ్యాక ఆమె భారత్‌కి రావడం ఇది రెండోసారి. 45 రోజుల వీసా గడువుతో ఇండియాలో అడుగుపెట్టిన సనా, పహల్గామ్ దాడి తరువాత పాలకులు ఇచ్చిన ఆదేశాలతో 11 రోజులకే పాకిస్తాన్‌కి తిరుగుముఖం పట్టింది. వాఘా సరిహద్దుకి చేరింది. అక్కడ వారి గుర్తింపు పత్రాలు పరిశీలించిన అధికారులు, సనాకి భారతీయ పౌరసత్వం ఉన్న కారణంగా తనని ఆపేశారు. పిల్లలకు పాకిస్తాన్ పౌరసత్వం ఉంది కాబట్టి వారిని సరిహద్దు దాటించారు. వివాహం అయి 9 ఏళ్లుపూర్తయితేనే సనాకి పాకిస్తాన్ పౌరసత్వం వస్తుంది. కాబట్టి తనకి ఇంకా ఆ దేశ గుర్తింపు కార్డు రాలేదు. ఇప్పుడు సనా తన ఇద్దరు బిడ్డలకి దూరమైంది. పిల్లలిద్దరూ భర్తతో, సనా ఒక్కత్తే పుట్టింట్లో ఉండిపోవాల్సిన పరిస్థితులు వచ్చాయి.

**అమ్మ లేకుండా.. అనారోగ్యంతోనే..:** 17 ఏళ్ల మహ్మద్ అయాన్, ఎస్‌యువి వ్యాన్‌లో ఓ మూలన కూర్చొని ఉన్నాడు. ఏడ్చి ఏడ్చి అతని కళ్లు వాచిపోయి ఎర్రగా ఉన్నాయి. వైద్యం కోసం అయాన్ ఇండియాకి వచ్చాడు. రెండేళ్ల క్రితం జరిగిన ఓ యాక్సిడెంట్‌లో అతని శరీరం చచ్చుపడిపోయింది. వీల్‌ఛైర్‌కే పరిమిత మైన కొడుకుకి మంచి చికిత్స చేయించుకోవాలని తల్లి అతన్ని తీసుకుని మార్చి 17న ఇక్కడికి వచ్చింది. ఆస్పత్రిలో అతనికి మెరుగైన వైద్యం అందుతోంది. ఉరుము మీద పిడుగులా పహల్గామ్ దాడితో అయాన్, అతని ముగ్గురు అక్కల పాకిస్తాన్ వీసాలు రద్దయ్యాయి. ఇప్పుడు వారంతా బలవంతంగా ఈ దేశం వీడుతున్నారు.

ఇక్కడ ఇంతకంటే విషాదం ఏంటంటే, అయాన్, అతని అక్కలు, వాళ్ల అమ్మ లేకుండా పాకిస్తాన్‌కి పయన మయ్యారు. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకున్న అయాన్ వాళ్ల అమ్మ భారతీయురాలు. ఆమెకి ఇక్కడ పౌరసత్వం ఉంది. అమ్మని వదిలివెళ్తున్న అయాన్ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నాడు. 'ఇప్పుడు నేను ఒంటరిగా ఇంటికి వెళ్లాలి. అక్కడ అమ్మ లేదు. ఈ బాధ, నా అనారోగ్యం కంటే నన్ను ఎక్కువగా బాధపెడు తోంది' అంటూ అయాన్ ఏడ్వడం చూసిన అతని అమ్మ, అక్కలు ఒక్కసారిగా ఘొల్లుమన్నారు.

**నా వాళ్లతో మనస్ఫూర్తిగా మాట్లాడనేలేదు..:** 10 ఏళ్లుగా వీసా కోసం దరఖాస్తులు చేసుకుని, ఇటీవలే తన పుట్టింటికి చేరింది 52 ఏళ్ల సలీమున్నిసా. 'అక్కాచెల్లెళ్లతో సంతోషంగా గడపాలని ఎన్నో కలలు కన్నాను. ఇష్టమైన ఆహారం వండించుకోవాలనుకున్నాను. అమ్మ తరపు బంధువులందరినీ కలవాలనుకున్నాను. కానీ ఇప్పుడవేమీ జరగలేదు. రోజుల వ్యవధిలోనే ఉన్న ఫళంగా వెనుదిరిగాను. మళ్లీ నా వాళ్లని ఎప్పుడు కలుస్తానో తెలియదు' అంటూ విచారంగా ముఖం పెట్టిన సలీమా లాంటి వాళ్లు అక్కడ ఎంతోమంది.

**మేము లేకుండానే మా బిడ్డ పెళ్లవుతోంది..:** 55 ఏళ్ల సింధు కార్వర్ భారతీయ హిందూ మహిళ. పాకిస్తాన్ పౌరుడ్ని పెళ్లి చేసుకుంది. ఏప్రిల్ 29న జోధపూర్‌లో తన కూతురు వివాహం చేయాలని సింధు కుటుంబమంతా భారత్‌కి వచ్చింది. పెళ్లికి అన్నీ సిద్ధం చేసుకున్నాక వాళ్ల వీసాలన్నీ రద్దయ్యాయి. పెళ్లికూతురు భారత్‌లో పుట్టింది కాబట్టి, ఆమెకి ఈ దేశ పౌరసత్వం ఉంది. దీంతో ఆమెని అక్కడే వదిలి 1000 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఆ కుటుంబం వాఘా బోర్డర్ చేరుకుంది. అక్కడ అదే పనిగా ఏడుస్తున్న సింధుని ఓదార్చడం అక్కడున్న వాళ్ల తరం కావడం లేదు. 'కూతురు పెళ్లి ఎంతో సంతోషంగా చేయాలను కున్నాం. డిసెంబరులోనే ఇక్కడికి వచ్చాం. షాపింగ్ చేశాం. బంధువులందరినీ పిలిచాం. రెండు రోజుల్లో పెళ్లి ఉందనగా 'పాకిస్తాన్ దేశీయులు దేశం విడిచి వెళ్లిపోవాల'న్న వార్తలు చూశాం. కాశ్మీర్‌లో ఏం జరిగిందో నాకు తెలియదు. ఈ రాజకీయాలు అర్థం చేసుకునేంత పరిణతి నాకు లేదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే.. ఇప్పుడు మేము లేకుండానే మా కూతురు పెళ్లి జరగబోతోంది. ఏ తల్లికీ నాలాంటి పరిస్థితి రాకూడదు' అని సింధు ఏడ్వడం తన మేలిముసుగులోంచి స్పష్టంగా కనిపిస్తోంది.

ఇలాంటి ఎన్నో విషాదాలు వాఘా సరిహద్దు వద్ద కనిపించాయి. ఉన్మాదం నిండిన వ్యక్తులు చేసిన, చేస్తున్న దుశ్చర్యలు బతికున్న వాళ్లని కూడా జీవచ్ఛవాలుగా చేస్తున్నాయి. వేలాది కుటుంబాలని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్ని వయసుల వారు ఈ విపరీతాలకు తల్లడిల్లిపోతున్నారు.

# హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల మీద ఉచితాలు ప్రకటించారు. ఏకంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియాగాంధీ లాంటి వారిని పిలిపించి డిక్లరేషన్లు ప్రకటించారు. కానీ వాటి అమలులో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రేవంత్ రెడ్డికి తెలుసు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే నాటి కెసిఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. గడువు ముగియకముందే ముందుగానే వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. తద్వారా అప్పటి ఎన్నికల్లో నెగ్గడానికి ప్రణాళికలు రూపొందించింది. కానీ ఆ ఎన్నికల్లో ప్రజలు వేరే విధంగా తీర్పు ఇవ్వడంతో భారత రాష్ట్ర సమితికి తల బొప్పి కట్టింది.

ఇక నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిల్లో కొన్ని మాత్రమే అమలులో పెట్టింది. అమలు ఉన్న పథకాలు కూడా అంతంతమాత్రంగానే ప్రజలకు చేరువవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ప్రస్తావిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగుతోంది. ఇది ఊహించిన పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకుంది. ఇటీవల జరిగిన ప్రతి సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు. చివరికి ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే.. తెలంగాణ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే బాగుపడుతోందని.. కార్మికులు సమ్మెకు దిగితే నష్టం తీవ్రంగా వాటిల్లుతుందని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఏమాత్రం బాగోలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని రేవంత్ రెడ్డి పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగో లేనప్పుడు.. అని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించమని ఎవరు చెప్పారు? నాడు అవుటర్ రింగ్ రోడ్డు ను లీజుకు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని లెక్కలతో సహా వివరించారు. మరి అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేయాలంటే డబ్బులు ఉండాలనే విషయం రేవంత్ రెడ్డికి తెలియదా.. అంటే అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇస్తారా? చివరికి ఓట్లు వేయించుకొని ప్రజలను వెర్రివాళ్లను చేస్తారా? అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. ప్రతి సమావేశంలోనూ బడ్జెట్ పద్మనాభం లాగా లెక్కలు వేయడం.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం.. పరిపాటిగా మారిపోయిందని.. రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

# 85 కిలోమీటర్ల కు మెట్రో డీపీఆర్ రెడీ



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి' భాగంగా జేబీఎస్ నుండి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుండి శామీర్‌పేట (21 కి.మీ.), శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.) వరకు మూడు కీలకమైన మెట్రో మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కేంద్రానికి పంపుతుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదన ఉంది.. దీనిరూపకల్పన జపాన్‌లోనిరవాణా వ్యవస్థ ను స్ఫూర్తిగా తీసుకుంటుంది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ తన రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. రెండో దశ 'బి'లో భాగంగా ప్రతిపాదించిన కీలకమైన మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదించాల్సి ఉంది. బోర్డు ఆమోదం తర్వాత.. రాష్ట్ర మంత్రివర్గం దీనిపై చర్చించి ఆమోదం తెలుపుతుంది. అనంతరం.. తుది అనుమతి కోసం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు. రెండో దశ 'బి'లో హైదరాబాద్ నగరంలోని ఉత్తర ప్రాంతా లకు మెట్రో అనుసంధానాన్ని విస్తరించేందుకు ముఖ్య మైన ప్రతిపాదన లు ఉన్నాయి. ఇందులో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుండి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్ల మేర ఒక మార్గం, అలాగే జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు 21 కిలోమీటర్ల మేర మరొక మార్గం ప్రతిపాదించబడ్డాయి. వీటితో పాటు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం యొక్క డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుండి ప్రారంభమై.. కొత్తగా ప్రతిపాదించిన మెట్రో రైలు డిపో పక్కనుంచి.. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి ఆకాశ మార్గంలో కొనసాగుతుంది. ఇది మాన్సాన్‌పల్లి, బహుదూర్‌గూడ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్, తుక్కుగూడ ఎగ్జిట్, రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సర్వీస్ రోడ్డులో వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. అక్కడి నుండి, ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి ద్వారా కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ , మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ మార్గం విస్తరించనుంది. ఈ డీపీఆర్‌ను మొదట హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఎండీతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శులు మరియు హెచ్ఎండీఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు.. జేబీఎస్ వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రితో పాటు జపాన్ పర్యటనకు వెళ్లిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అక్కడి అనుభవాలను ఈ మెట్రో హబ్‌లో పొందుపరిచేందుకు కృషి చేస్తున్నారు. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు, మెట్రో,సాధారణ రైలు సదుపాయా లు ఒకదానితో మరొకటి అనుసంధానించబడి ఉంటాయి. ప్రయాణికు లు ఒక రైలు నుండి మరొక రైలుకు సులభంగా మారేలాఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇదే తరహా అనుసంధాన వ్యవస్థను జేబీఎస్ మెట్రో హబ్‌లో కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

# మళ్లీ టీడీపీ వైపు

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆ ఇద్దరు నేతలు తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు. ఎన్నో కీలక పదవులు అనుభవించారు. కానీ అనుకోని రీతిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా అనుకున్నంత సక్సెస్ కాలేకపోయారు. కేవలం అప్పటి అధికార వైసీపీ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ పార్టీలోకి జంప్ చేశారు. కానీ ఇప్పుడు తిరిగి మాతృ పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వారు పొలిటికల్ సర్కిల్లో నిలబడ్డారు. ఇంతకీ ఎవరా నేతలు? ఏంటా కథ? అంటే వివరాల్లోకి వెళ్దాం. ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయంగా చైతన్యవంతం అయ్యింది. ఈ జిల్లా నుంచి ఎంతోమంది హేమాహేమీలు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అందులో ఒకరు కరణం బలరామకృష్ణ. సుదీర్ఘకాలం టిడిపి నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన బలరామకృష్ణకు మంత్రి పదవి అన్నది దక్కకుండా పోయింది. ప్రకాశం జిల్లా రాజకీయాలను శాసించిన ఈ నేత అమాత్య అని అనిపించుకోలేకపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ నుంచి మంత్రిగా అవుతానని భావించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. మరో మాజీ మంత్రి సిద్దా రాఘవరావు ది విచిత్ర పరిస్థితి. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకున్నారు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఓడిపోవడంతో రాఘవరావు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేవలం వ్యాపారాలపై ఒత్తిడి పెరగడంతోనే వీరు వైసీపీలో చేరినట్లు ఒక ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు తిరిగి టిడిపిలో చేరేందుకు వీరిద్దరూ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కరణం బలరాం విషయంలో టిడిపి నుంచి అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఎందుకంటే చీరాల నుంచి టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు. గెలిచిన తర్వాత పార్టీ క్లిష్ట సమయంలో ఉండగా గుడ్ బై చెప్పారు కరణం బలరాం. అందుకే ఎట్టి పరిస్థితుల్లో కరణం బలరామును పార్టీలో చేర్పించుకోవద్దని చంద్రబాబుపై టిడిపి శ్రేణుల ఒత్తిడి ఉంది. దీంతో చంద్రబాబు సైతం కరణం బలరాం విషయంలోముఖం మీద చెప్పినట్లు సమాచారం. అయితే ఆయనను జనసేనలో చేర్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. తన కుమారుడు వెంకటేష్ రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలో చేరేందుకు బలరాం దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోవైపు సిద్దా రాఘవరావువిషయంలో మాత్రం టిడిపిలో సానుకూలత వ్యక్తం అవుతోంది. ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి రాఘవరావుకు అరుదైన అవకాశం ఇచ్చారు చంద్రబాబు. 2014లోగెలవడంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2019 లోఎంపీగా కూడా పోటీ చేశారు రాఘవరావు. అయితే ఆయనకు గ్రానైట్ తో పాటు ఇతరత్రా వ్యాపారాలు ఉన్నాయి. అప్పటి అధికార వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడి చేసి రాఘవరావును పార్టీలో చేర్చుకుం దని..తీరాచేర్చుకున్నాక పట్టించుకోకుండా మానేసింది అన్న సాను భూతిఆయనపై ఉంది. అందుకే రాఘవరావు విషయంలో చంద్రబా బు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని ప్రచారం సాగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

## సర్వీసు రోడ్డులో అక్రమ నిర్మాణాలు: బీజేపీ

**చౌటుప్పల్,తెలంగాణ దిశ:**యాదాద్రి భువనగిరి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్ లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు గురై వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, అట్టి అక్రమ కట్టడం దర్గాపై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి వినతిపత్రం అందజేసిన. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి,దూడల భిక్షం, బిజెపి నాయకులు పాల్గొన్నారు. గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులపై గ్రీన్ ఫీల్డ్ హైవేలు మరియు ఎక్స్ ప్రెస్ రహదారులు నిర్మించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది కానీ విజయవాడటు హైదరాబాదుకు వెళ్లే జాతీయ రహదారి 65 పై సర్వీస్ రోడ్లో అడ్డంగా ప్రార్థనా మందిరాలు నిర్వహిస్తున్న కానీ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి నిమ్మకు నీరు ఎత్తకుండా వ్యవహరిస్తున్నారు వీరి వ్యవహార శైలి చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ తో ఇబ్బంది పడుతున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని సుమారు 114 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిన తర్వాత అనుమతులు వచ్చిన తర్వాత దాని అలైన్మెంట్ ఈ దర్గా కోసం అలైన్మెంట్ మార్చారు మొదట ఎలాగైతే అనుమతులు ఇచ్చారో దాని ప్రకారమే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఒక వర్గం కోసం ఎదురు చూడకుండా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా రహదారులు నిర్మించాలని కోరారు..

## సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి..

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశం



**మల్కాజిగిరి,తెలంగాణ దిశ:** సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. మచ్చబొల్లారం డివిజన్ లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థా పన చేశారు. అనంతరం మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గుంత లు పడిన రోడ్లతోప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించా మని అన్నా రు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా పనులను అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. సర్కిల్ పరిధిలోని అన్ని రోడ్లను అధికారులతో సర్వే చేయించి, అవసరమైన కాలనీల్లో వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

# హాలో..! ఫ్యామిలీ డాక్టర్..

అది 1990. అప్పట్లో ఓ పల్లెటూరు. ఆ ఊళ్లో ఒక బడి, నాలుగు పచారీ కొట్లు, పంచాయతీ కార్యాలయంతో పాటుగా%ొ% ఆ పల్లె జీవితంలో భాగమయ్యేది ఓ చిన్న క్లినిక్. పిల్లలకి జ్వరం వచ్చినా, చెవిపోటు మెలిపెట్టినా, పెద్దోళ్ల మోకాళ్ల నొప్పులైనా, రక్తపోటు లాంటి జీవితకాలపు సమస్యలైనా%ొ% ఆ దవాఖానకే దారి. డాక్టరుగారు సౌమ్యంగా ఉన్నా చిర్రుబుర్రులాడినా జనం దృష్టిలో తను దేవుడే. తన హస్తవాసి అలాంటిది మరి. కిటకిటలాడే గదిలో ఒకరి తర్వాత ఒకరుగా రోగ లక్షణాలు చెబుతుంటే, వింటూనే రకరకా మందులు రాసేస్తారు. ఆ లక్షణాలు తగ్గకపోయినా, పరిస్థితి విషమంగా తోచినా%ొ% వెంటనే పెద్దాసుపత్రికి సిఫార్సు చేసేస్తారు.

రోగిని ఇంతని ఫీజు అడగకపోవచ్చు. తర్వాత ఇస్తానన్నా పట్టించుకోకపోవచ్చు. జన్మనిచ్చిన తల్లిలాగే, పెద్దచేసే తండ్రిలాగే, చదువు చెప్పే గురువులాగే%ొ% ఆయన కూడా మనల్ని ఆరోగ్యంగా చూసుకునే బాధ్యతను తీసుకున్నారు మరి. అందుకే ఇప్పటికీ చాలామందిని వాళ్ల ఊరి జ్ఞాపకాలు గుర్తుచేస్తే అందులో ఆ ఫ్యామిలీ డాక్టర్ తప్పకుండా గుర్తుకొస్తాడు. వాళ్లలో చాలామంది ఆర్ఎంపీలు కావచ్చు.

ఎంబీబీఎస్‌లూ ఉండవచ్చు. సర్జన్‌లూ కనిపించవచ్చు. కానీ ఫ్యామిలీ డాక్టర్‌గా ఇంటిల్లిపాదినీ కాచుకున్న చరిత్ర వాళ్లది. కానీ ఇప్పుడు పిల్లలకి, మోకాళ్ల నొప్పులకీ, డయాబెటిస్‌కీ, కిడ్నీ రాళ్లకీ%ొ% అన్నిటికీ వేర్వేరు డాక్టర్లు. తప్పేం కాదు. కానీ ఈ హడావుడిలో మాయమైపోతున్న ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ, దానివల్ల కలుగుతున్న నష్టాలను మాత్రం ఓసారి తలుచుకోవాల్సిందే!

ఓ యాభై ఏళ్ల గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఆరోగ్యం పట్ల అవగాహన పెరిగింది. రోగాన్ని గుర్తించడం, చికిత్స, మందులు అన్నిటిలోనూ సౌలభ్యం పెరిగింది. రవాణాలో మార్పు వల్ల 'పెద్దాసుపత్రులు' మరింత చేరువయ్యాయి. కానీ మన కుటుంబాన్ని గమనించుకోవాల్సిన ఫ్యామిలీ డాక్టర్ అవసరం మాత్రం అలాగే ఉంది. ఇంకా మాట్లాడితే తన బాధ్యత మరింత పెరిగింది. కానీ అటువైపు వెళ్తున్న వైద్యులు, వారి దగ్గర చికిత్సను కోరుకునే రోగుల సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గిపోతున్నది. నిశ్శబ్దంగా వచ్చిన ఈ మార్పు వెనుక కారణాలు మాత్రం చాలా స్పష్టంగా ఉన్నాయి. దానికంటే ముందు కాస్త మంచిని తల్చుకుందాం..

ఫ్యామిలీ డాక్టర్ అంటే ఇంట్లో మనిషే. మన ఇంట్లో పసిపిల్లల దగ్గర్నుంచీ వృద్ధుల వరకూ ఎవరి సమస్యలు ఏమిటి, వాటికి ఎలాంటి చికిత్సలు జరుగుతున్నాయి, ఏ పనులు చేస్తారు, వారి జీవనశైలి ఎలా ఉంటుంది లాంటి కూలంకషమైన విషయాలన్నీ ఆయనకు కొట్టిన పిండి. దాంతో మన శరీర తత్వాన్ని బట్టి చికిత్స, అవసరాన్ని బట్టి మందులూ ఇస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మన దేశంలో దాదాపు 7.7 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. మరో 2.5 కోట్ల మంది మధుమేహానికి చేరువగా ఉన్నారు. అందుకే మన దేశాన్ని మధుమేహ రాజధానిగా పిలుస్తున్నారు. కదలని మెదలని జీవనశైలి వల్లనో, వంశపారంపర్యంగానో ఈ మధుమేహంతో పాటుగా రక్తపోటు, ఊబకాయం లాంటి సమస్యలు వస్తున్నాయి. తరచూ ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి వెళ్లి చెకప్ చేయించుకోవడం, వాళ్ల మందులు క్రమం తప్పకుండా తీసుకోవడమే వీటికి పరిష్కారం.

నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్. అంటే ఇవి ఒకరి నుంచి ఒకరికి సోకవు. ఆస్తమా నుంచి కిడ్నీ సమస్యల వరకూ చాలా సమస్యలు ఈ కోవలోకే వస్తాయి. కానీ మన ఆయుష్షుకి ఇవే కీలకం. ఓ అంచనా ప్రకారం మన దేశంలో 60 శాతం మరణాలకు ఇవే కారణం. ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగానూ భారమయ్యే ఈ పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టర్‌ది కీలకపాత్ర. సమస్య ముదరకుండా చికిత్స చేయడం దగ్గర్నుంచీ, పెద్దాసుపత్రిలో చికిత్స తీసుకుంటే%ొ% తిరిగివచ్చాక గమనించుకోవడం వరకూ తను బాధ్యత తీసుకుంటారు.

ఓ అంచనా ప్రకారం మన దేశంలో 38 శాతం పిల్లలు, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఎత్తులో ఉన్నారు. 'స్టంటెడ్' అనే ఈ సమస్యకు కారణం పోషకాహార లోపమే. సాధారణ దృష్టికి తోచని ఇలాంటి ఎన్నో సమస్యలను డాక్టర్లు చూడగానే పసిగట్టేస్తారు. మన కళ్లజోడు ఫ్రేం నుంచి వేసుకున్న చెప్పుల వరకూ తెలిసీతెలియక చేసే లోపాలను గుర్తుపట్టేస్తారు. వీటన్నిటి గురించి సలహా ఇచ్చే చొరవ, అవకాశం ఫ్యామిలీ డాక్టర్లకే ఎక్కువ.

మన దేశంలో వైద్యానికి అయ్యే ఖర్చులో 60 శాతం రోగుల కుటుంబాలే భరిస్తున్నాయి. సంస్థలు లేదా బీమా వ్యవస్థ నుంచి అందేది 40 శాతం మాత్రమే అని అంచనా. ఈ నేపథ్యంలో కేవలం అవసరమయ్యే చికిత్సనే అందించే ఫ్యామిలీ డాక్టర్లు మేలు చేస్తున్నట్టే.

రోగం అనగానే మెడికల్ టెస్టులే గుర్తుకు వస్తున్న కాలమిది. రోగ నిర్ధారణ కోసం పరీక్షలు రాసినప్పుడు 88 శాతం రోగులకు అందులో ఒక్క పరీక్షన్నా అనవసరంగా రాస్తున్నారని ఓ నివేదిక చెబుతున్నది. అంతేకాదు తల మీద చిన్నపాటి దెబ్బలకు కూడా సీటీ స్కాన్ రాస్తున్నారనీ, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ మమోగ్రాం లాంటివి తరచుగా అవసరం లేదనీ లలిత్ కపూర్ అనే సామాజిక ఉద్యమకారుడు హెచ్చరిస్తున్నారు. లేనిపోని ఇలాంటి పరీక్షల వల్ల ఆర్థికపరమైన సమస్యలతో పాటు రోగులు ఉద్వేగానికి కూడా లోనవుతున్నారని డాక్టర్ సంజయ్ పాటిల్ వాపోతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పర్యవేక్షణలో ఏ పరీక్ష అవసరం, అసలు దాని లక్ష్యం ఏంటి లాంటి అనుమానాలన్నీ తీరిపోతాయి.

ఫ్యామిలీ డాక్టర్ల కష్టాలు!: ఒకప్పుడంటే పది రూపాయల ఫీజు తీసుకున్నా ఆదాయం కింద చెల్లిపోయేది. కానీ రోజులు మారాయి. వైద్య విద్య పూర్తిచేయడానికి అయ్యే విపరీత ఖర్చులతో పాటు ప్రపంచీకరణ పుణ్యమా అని జీవనశైలి ఖర్చులూ పెరిగిపోయాయి. క్లినిక్‌ల నిర్వహణ వ్యయాలూ పెరిగాయి. ఓ మల్టి స్పెషాలిటీ ఆసుపత్రిలో విజిటింగ్ డాక్టర్‌గా పనిచేసినా, కడుపులో చల్ల కదలకుండా వచ్చే ఆదాయం%ొ% ప్రత్యేకమైన క్లినిక్‌ల ద్వారా రావడం లేదన్నది చాలామంది ఆవేదన. కేవలం ఆర్థికపరమైన సమస్యలే కాదు! ఇతరత్రా చాలా సమస్యలూ వారిని వేధిస్తున్నాయి.

జ్వరం వస్తే డోలో, జలుబు చేస్తే రిలెంట్, కడుపునొప్పికి మెట్రోజిల్%ొ% ఇలా మందుల పేర్లు కాకుండా వాటి కంపెనీల పేర్లు ఎప్పుడైతే జనాలకు అలవాటయ్యాయో, ఏ సమస్య వచ్చినా వారే కొనుక్కుని వేసుకోవడం పెరిగిపోయింది. వైద్యుడి చీటీ లేకుండా 'ఓవర్ ద కౌంటర్' మందులను అందించేందుకు విదేశాల్లో చాలా నిబంధనలు ఉన్నాయి. మన దగ్గర మాత్రం నిద్రమాత్రలు సైతం ఎక్కడో అక్కడ దొరికేస్తున్నాయి. భారతీయులు డోలో 650ని చాక్లెట్లు నమిలినట్టు నమిలేస్తున్నారంటూ ఇటీవల పళనియప్పన్ అనే వైద్యుడు చేసిన ట్వీట్ ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. ఇక చిన్నపాటి సమస్యలకు వైద్యులతో పనేముంది.

కొవిడ్ సమయంలో చాలా పనులు ఆన్‌లైన్‌లో చేయవచ్చనే భరోసా ఏర్పడింది. వాటిలో వైద్యం కూడా ఒకటి. అందుకే కేంద్ర ప్రభుత్వం సైతం ఈ-సంజీవని లాంటి ఆన్‌లైన్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇక ప్రాక్టో, 1ఎంజీ లాంటి ప్రైవేట్ సేవలు కూడా వైద్యాన్ని ఆన్‌లైన్‌లోకి తెచ్చేశాయి. మన దేశంలో 2022 నాటికి బిలియన్ డాలర్ల వ్యాపారంగా ఉన్న ఈ టెలిమెడిసిన్ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లు దాటేస్తుందని ఇన్‌సైట్స్ అనే సంస్థ అంచనా వేస్తున్నది. ఇది ఫ్యామిలీ డాక్టర్లకు ప్రత్యక్ష పోటీనే!

వైద్యం అంటే ఆసుపత్రి, రోగ నిర్ధారణ అంటే పరీక్షలు అనే అభిప్రాయాలు బలపడుతున్నాయి. ముఖ్యంగా నగరాల్లో ఎటుచూసినా హాస్పిటల్సే కనిపిస్తున్నాయి. వీటి సంఖ్య ఏటా 8 శాతం పెరుగుతున్నట్టు తెలుస్తున్నది.

సాంకేతికత చాలా వేగంగా మారుతున్నా ఇప్పటికీ చాలామంది ఫ్యామిలీ డాక్టర్లు పాత పద్ధతులనే పాటిస్తున్నారనే అపవాదు ఉంది. కొన్ని క్లినిక్‌లలో కనీస శుభ్రత కూడా ఉండదు. డిజిటల్ థర్మామీటర్లు సైతం కనిపించని ఇలాంటి క్లినిక్‌లకు వెళ్లేందుకు యువతరం అంత ఆసక్తి చూపించదు. అది సహజం.

ఏటా మన దేశంలో లక్షమంది వైద్య పట్టా పుచ్చుకుంటున్నారని అంచనా. వీరిలో అతి తక్కువ మంది మాత్రమే ఫ్యామిలీ మెడిసిన్ వైపు అడుగులు వేస్తున్నారు. దాంతో ఇప్పటికే ఉన్న వైద్యుల మీద భారం పడుతున్నది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వైద్యుల ముందు జనం బారులు తీరాల్సిన పరిస్థితి. ఇది వైద్యుడి పనివేళల మీద విపరీతమైన ఒత్తిడి తెస్తున్నది. పైగా ఇంజక్షన్ చేయడం దగ్గర నుంచీ శాంపిల్ సేకరణ వరకూ అన్నీ ఒకరే చేయాల్సిన పరిస్థితి ఉంటే ఇక ఆ భారం చెప్పనక్కర్లేదు.

మార్పులూ రావాలి!: ప్రభుత్వాలు.. ఫ్యామిలీ డాక్టర్స్ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల అవసరాన్ని పూర్తిగా గుర్తించినట్టు కనిపించదు. ప్రజల ఆరోగ్యం కోసం వారితో కలిసి పనిచేయాలి. సబ్సిడీలు లాంటి సౌకర్యాలు ఇస్తే కాస్త ఊరటగా ఉంటుంది. ఫ్యామిలీ క్లినిక్ అంటే పాత, మోటు పద్ధతులు అనే అపవాదును వదులుకోవాలి. డిజిటల్ వస్తువులు, పరిశుభ్రత, ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ లాంటి సదుపాయాలు కల్పిస్తే రోగులకు వెసులుబాటుగా ఉంటుంది. ఇతర దేశాలతో పోలిస్తే మన వైద్య సంస్థలు 'ఫ్యామిలీ మెడిసిన్'కి తక్కువ ప్రాధాన్యత ఇస్తాయనీ జాతీయ స్థాయిలోఅందుకు సమగ్రమైన కోర్సులు లేవనే అపవాదు ఉంది. మన వైద్య కోర్సులు ఎక్కువగా ఆసుపత్రులకు లేదా రోగ నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఓ పరిశీలన.

వైద్యరంగంలో ఎప్పటికప్పుడు అనూహ్యమైన మార్పులు వస్తుంటాయి. సదస్సులు, శిక్షణల ద్వారా ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఫ్యామిలీ డాక్టర్లకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఆదిశగా ఎంతవరకు చొరవ ఉందన్నది ప్రశ్నార్థకమే!

ఎవరీ ఫ్యామిలీ డాక్టర్స్?: ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ఫ్యామిలీ



మెడిసిన్ రంగంలో మరో స్పెషలైజేషన్ చేస్తే 'ఫ్యామిలీ ఫిజీషియన్'గా గుర్తింపు దొరుకుతుంది. రోగ నిర్ధారణ మొదలుకుని రోగులతో అనుబంధం పెంచుకోవడం వరకూ ఈ కోర్సులో ఓ కుటుంబ వైద్యుడికి ఉండాల్సిన అన్ని నైపుణ్యాలనూ నేర్పిస్తారు.

అలాగని వీరు మాత్రమే ఫ్యామిలీ డాక్టర్లుగా చెలామణీ అవ్వాలనే నిబంధన ఏమీ లేదు. ఎంబీబీస్‌తో ఆగిపోయినవారు, ఎంబీబీఎస్ తర్వాత సర్టిఫికెట్ కోర్సులు చేసినవారు, ఆర్ఎంపీ లాంటి కొన్ని గుర్తింపులు తెచ్చుకున్నవారూ%ొ% అంతదాకా ఎందుకు! ఏదన్నా రంగంలో స్పెషలైజేషన్ చేసినా కూడా అన్నిరకాల వ్యాధులనూ పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నవారు ఫ్యామిలీ డాక్టర్లే!

గ్రామీణ భారతానికి రక్ష!:మన దేశంలో ప్రతీ 834 మందికీ ఓ వైద్యుడు ఉన్నాడని గణాంకాలు చెబుతున్నాయి. చాలా దేశాలతో పోలిస్తే ఇది మెరుగైన సంఖ్యే అని ప్రపంచ ఆరోగ్య సంస్థే చెబుతున్నది. కానీ వీళ్లలో ఎక్కువ శాతం నగరాల్లోనే ఉంటున్నారు. పల్లెల్లో ఉంటున్న నాలుగో వంతు మంది వైద్యులకు తోడు, ఆర్ఎంపీలు, ప్రాథమిక ఆరోగ్య నిపుణులే అక్కడి వైద్యానికి కీలకం.

65 శాతం జనాభా గ్రామాల్లోనే ఉండే మన దేశంలో చిన్నాచితకా సమస్యలన్నిటికీ ఫ్యామిలీ డాక్టర్లే సంజీవని. ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలకైనా, కొవిడ్ లాంటి ఉపద్రవాల్లో అయినా ఈ ఫ్యామిలీ డాక్టర్లదే ముఖ్యపాత్ర. మరో విషయం%ొ% అపరిశుభ్రత, కలుషిత నీరు లాంటి సమస్యలు అక్షరాస్యత, అవగాహన తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ. వీటి విషయంలో హెచ్చరించే బాధ్యత తీసుకుంటున్నారు అక్కడి వైద్యులు.

డాక్టర్ మీదే టెస్టులు: 'డాక్టర్ గారు అసలే చాలా బిజీగా ఉంటారు, పైగా అక్కడ వెయిటింగ్ కూడా ఎక్కువగా ఉంటుంది. చిన్నచిన్న సమస్యలకు ఆయన్ని కలవకపోవడమే మంచిది' అని చాలామంది రోగులు తమ ఫ్యామిలీ డాక్టర్‌ను కలిసేందుకు ఇష్టపడరట. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధనలో తేలిన విషయం ఇది.

నిజానికి చాలాసార్లు చిన్నచిన్న సమస్యలే పెద్ద జబ్బులకు లక్షణాలనీ, కాబట్టి అవసరం అనుకున్నప్పుడు సంశయించక వైద్యుడిని కలవాలని వీరు సూచిస్తున్నారు. ఒకే ఫ్యామిలీ డాక్టర్‌ని తరచూ కలవడం వల్ల, కొన్నాళ్లకు తనతో ఓ అనుబంధం ఏర్పడుతుందని బ్రిస్టల్ విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన చెబుతున్నది. దీనివల్ల రోగులు తమ అనారోగ్యాలను మరింత స్పష్టంగా చెబుతున్నారనీ, వాటికి మెరుగైన చికిత్స లభిస్తున్నదనీ తెలుస్తున్నది.

ఇంగ్లండులో చేసిన ఓ పరిశోధనలో ఫ్యామిలీ డాక్టర్ల మీద ఆధారపడేవారిలో అప్పటికప్పుడు హాస్పిటల్లో అడ్మిట్ అయ్యే ప్రమాదం తక్కువని తేలింది. తమ ఆరోగ్యాన్ని తరచూ పర్యవేక్షించుకునే అవకాశం, వ్యాధులు తొలిదశలోనే ఉన్నప్పుడు వాటికి చికిత్స తీసుకోవడమే ఇందుకు కారణం. ప్రతీ పరిశోధనా ఫ్యామిలీ డాక్టర్లకు అనుకూలంగా ఉంది అనడానికి లేదు.

ఉదాహరణకు కార్డిఫ్ విశ్వవిద్యాయం పరిశోధకులు సేకరించిన వివరాల్లో పంటినొప్పి తగ్గడానికని ఫ్యామిలీ డాక్టర్ దగ్గరికి వెళ్లినవారికి శాశ్వత పరిష్కారం సూచించకుండా యాంటీబయాటిక్స్ ఇవ్వడం వల్ల వారిశరీరం ఆ మందులకు అలవాటు పడిపోయిన సందర్భాలు కనిపించాయి. ప్రతి నొప్పికీ మందే కాదు, ఇతర 'స్పెషలిస్ట్' చికిత్సలు కూడా అవసరం పడతాయనే విషయాన్ని ఇది సూచిస్తుంది.

ఎలాంటి వ్యక్తిని ఎంచుకోవాలి?: చాలాసార్లు మనం సంప్రదించే వైద్యుడి అర్హతను గమనించుకోం. తను ఆర్ఎంపీ లాంటి కోర్సులు చేశాడా లేదా ఎంబీబీఎస్ పట్టా తీసుకున్నాడా లేదా అని గమనించుకోవాలి. అవసరమైతే తన రిజిస్టర్డ్ నెంబరుని నిర్మొహమాటంగా పరీక్షించుకోవచ్చు. దేశంలో పదిలక్షల మంది నకిలీ వైద్యులున్నారనే గణాంకాలు వింటే, ఈ తరహా జాగ్రత్త ఎంత అవసరమో అర్థమవుతుంది.

ప్రతి వైద్యుడికీ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఏదన్నా సర్టిఫికెట్ కోర్సు చేయడం ద్వారానో, ఓ హాస్పిటల్లో పనిచేయడం వల్లో, ప్రత్యేక ఆసక్తితోనో వాళ్లు కొన్ని అంశాల మీద పట్టు సాధిస్తారు. పిల్లల వైద్యం, మధుమేహం, జ్వరాలు, రక్తపోటు ఇలా ఏదో ఓ నేర్పు ఉండవచ్చు. ప్రత్యేకమైన అవసరాలు ఉన్నవారు అందుకు అనుగుణమైన వైద్యులను ఎంచుకోవాలి.

వైద్యుడు మనకు దగ్గరలో ఉన్నారా? అప్పుడప్పుడూ కాకుండా ప్రత్యేకమైన క్లినిక్‌లో తగినంత సమయాన్ని కేటాయిస్తుంటారా? తరచూ టూర్ల మీద వెళ్లకుండా అందుబాటులో ఉంటారా? ఫోన్‌కి స్పందిస్తారా? లాంటి అంశాలనూ గమనించుకోవాలి. లేకపోతే నిజంగా తన సలహా, సంప్రదింపు అవసరం అయినప్పుడు అవి దొరక్కపోతే కష్టం.


ఓ వైద్యుడి దగ్గరికి మొదటిసారి వెళ్లినప్పుడు మన ఆరోగ్య చరిత్రను క్షుణ్నంగా వింటున్నారా? ఏదన్నా సమస్యను చెప్పినప్పుడు దాని కారణాలనీ, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పులనీ సూచిస్తున్నారా లేకపోతే మందు రాసి పంపేస్తున్నారా?పెడసరంగా కాకుండా ధైర్యాన్నిచ్చేలా మాట్లాడుతున్నారా? మందులు, టెస్టులు రాసినప్పుడు వాటి వెనుక కారణాలు వివరిస్తున్నారా? లాంటి అంశాలన్నీ ఓ వైద్యుడి మీద నమ్మకాన్ని నిర్ధారిస్తాయి.

ఈసీజీ, మధుమేహ పరీక్ష లాంటి మౌలిక పరికరాలతో పాటు అవసరమైతే కాసేపు చికిత్స చేసి (ఉదా? స్లైన్ ఎక్కించడం, కుట్లు వేయడం) పంపేందుకు అవసరమయ్యే వసతి ఉందో లేదో గమనించు కోవాలి. ఈ చికిత్సలకు బీమా సౌకర్యం ఉంటే మరీ మంచిది.

ఒక డాక్టర్‌తో కాసేపు గడిపితే తను ఎంతవరకు 'కమర్షియల్' అన్నది అర్థమైపోతుంది. కాస్త మానవతా దృక్పథం ఉన్న వైద్యులను ఎంచుకోవడం వల్లవారితో మానసిక, ఆర్థిక అనుబం ధాలు మెరుగ్గా ఉంటాయి. మన స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 2.1 శాతం మాత్రమే బడ్జెట్లో వైద్య రంగం కోసం కేటాయించినట్టు తెలుస్తుంది.

దీన్నిబట్టి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందాల్సిన అగత్యం ఉంది. అందుకు ఒకటే జవాబు! కుటుంబ వైద్యుడు. తను అండగా లేకపోతే దేశంలోని మధ్య, దిగువ తరగతి ప్రజల ఆరోగ్యంగాల్లో దీపంగా మారిపోతుంది. ఇప్పటికీ అయిదురూపాయల డాక్టరు, పదిరూపాయల డాక్టరు అంటూ నామమాత్రపు ఖర్చుతో చికిత్స చేసే వైద్యుల గురించి గొప్పగా చెప్పుకొంటున్నాం అంటే కారణం..మానవతా దృక్పథం ఉన్న వైద్యుల పట్ల మనకు ఉన్న అభిమానమే. అలాంటి వైద్యులకు అండగా నిలిచే ఫ్యామిలీ డాక్టర్ రంగాన్ని ఆదరించి, నిలబెట్టడం మన చేతుల్లో కూడా ఉంది.

# సరిహద్దులు దాటి నగరానికి చేరి..
# జూబ్లీహిల్స్‌లో విదేశీ యువతులతో దందా..?



**బంజారాహిల్స్,తెలంగాణ దిశ:** దేశాల సరిహద్దులు దాటి నగరానికి వచ్చిన యువ తులతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వ్యభిచార ముఠా గుట్టును జూబ్లీహిల్స్ పోలీసులు రట్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంగ్లాదే శ్‌లోని ఢాకా పట్టణం సమీపంలో నివాసం ఉంటున్న యువతి (23) గత ఏడాది డిసెంబర్‌లో రకిబ్ అనే ఏజెంట్ సాయంతో పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించింది. కొన్నాళ్ల పాటు తన ఇంట్లోనే ఆమెకు ఆశ్రయం కల్పించిన రకీబ్ ఆమెకు సిమ్ కార్డును సమకూర్చి బెంగళూరుకు పంపించాడు. అక్కడ మోజమ్ అనే వ్యభిచార నిర్వాహకుడి వద్దకు వెళ్లిన యువతిని నెలరోజుల పాటు గదిలో బంధించి వ్యభిచారం చేయించాడు. అక్కడినుంచి తప్పించు కుని బయటపడిన యువతి బెంగళూరులోని కోరమంగళ ప్రాంతో మరో బంగ్లాదేశీయురాలితో కలిసి రెండునెలల పాటు వ్యభిచారం చేసిన తర్వాత అఖిల్ అనే వ్యక్తి ఆమెతో స్నేహం చేసి హైదరాబా ద్‌లో నాయక్ అనే వ్యభిచార గృహం నిర్వాహకుడి వద్దకు పంపిం చాడు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 9లోని మింట్ లీవ్ సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ తీసుకుని గత కొంతకాలంగా వ్యభిచార గృహం నడిపిస్తున్న వ్యవహారంపై సమాచారం అందుకు న్న జూబ్లీహిల్స్ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన యువతితోపాటు థాయ్‌లాండ్‌కు చెందిన మరో యువతి (30)తో పాటు ప్రగతినగర్‌కు చెందిన ఓ ప్రైవేటు బ్యాంక్ ఉద్యోగి లక్ష్మీనారాయణరెడ్డి (43)అనే విటుడు పట్టుబడ్డాడు. దీంతో లక్ష్మీనారాయణరెడ్డిని అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు పట్టుబడిన విదేశీయువతులను విచారించగా షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. థాయ్‌లాండ్‌కు చెందిన యువతి (30) నెలన్నర క్రితం ట్రావెల్ వీసాతో భారత్‌లో ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకాక్‌లో వెళ్లినప్పుడు పరిచయం అయిన సుజీ అనే బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు చెన్నై వచ్చిన థాయ్ యువతి అతడితో కలిసి వివిధ నగరాల్లో తిరిగింది. డబ్బుల విషయంలో ఇద్దరి మద్యన విభేదాలు రావడంతో అతడినుంచి విడిపోయిన థాయ్ యువతి బ్యాంకాక్‌లో ఉన్న తన స్నేహితురాలు మాయ్ (35) అనే యువతికి ఫోన్ చేసింది. తనకు ఇండియాలో నాయక్ అనే వ్యభిచార గృహం నిర్వాహకుడితో పరిచయం ఉందని, కొన్నాళ్ల పాటు అతడివద్ద ఉండి వ్యభిచారం చేసి డబ్బులు సంపాదించుకుని థాయ్‌లాండ్ తిరిగి రావాలంటూ మాయ్ చెప్పడంతో పాటు కస్టమర్ల వద్దనుంచి తాను డబ్బులు వసూలు చేసి 1000 థాయ్ బాత్‌లు నీ అకౌం ట్‌లో జమచేస్తానని చెప్పింది. దీంతో కొన్నిరోజులుగా జూబ్లీహిల్స్ రోడ్ నెం9లో నాయక్ అనే వ్యక్తి నడిపిస్తున్న వ్యభి చార గృహంలో ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. థాయ్‌లాండ్‌కు వెళ్లి వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకుని బూమ్‌బూమ్ అనే కోడ్ వర్డ్‌తో నగరంలో నాయక్‌తో పాటు థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌కు చెందిన నిర్వాహకులు ఈ సెక్స్‌రాకెట్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గృహ నిర్వాహకుడు నాయక్, ట్రావెల్ ఏజెంట్ రకీబ్, యువతిని వ్యభిచా రంలోకిదింపిన అఖీల్, థాయ్‌లాండ్‌కు చెందిన మాయ్ అనే యువతి, పారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డిలపై బీఎన్ఎస్ 143(2), 144(2), బీఎన్ఎస్ 3,4 పిటా యాక్ట్ కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ముస్లిం దేశాల మద్దతు కోసం పాకిస్తాన్ యత్నం..!



లాహోర్,: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, భారత్?పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, దీని వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతుండగా, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు అంతర్జాతీయ సహకారం కోరుతూ దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తున్నారు.పహల్గాంలోని బైసరన్ మైదానంలో జరిగిన ఈ దాడి, భారత్‌లోని పర్యాటకులపై లక్ష్యంగా సాగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడిని లష్కర్?ఎ?తొయిబా తో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థ తామే చేసినట్లు మొదట ప్రకటించినప్పటికీ, తర్వాత ఆ ప్రకటనను ఉపసంహరించుకుంది. ఈ దాడి వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల సమన్వయం ఉన్నట్లు భారత గూఢచార సంస్థలు ఆరోపించాయి. ఈ ఘటన భారత్‌లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దీనికి గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది.

భారత్ ప్రతీకార చర్యలు దౌత్య చర్యలు: భారత్ పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది, వాఘా సరిహద్దును మూసివేసింది, మరియు పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసింది. సింధు నదీ ఒప్పందం రద్దు: 1960లో రూపొందిన సింధు నదీ ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది, దీనిని పాకిస్తాన్ 'యుద్ధ చర్య'గా అభివర్ణించింది. సైనిక సన్నద్ధత: భారత సైన్యం సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ, లైన్ ఆఫ్ కంట్రోల్ (ఒనీఅ) వెంబడి పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు గట్టిగా స్పందిస్తోంది.


పాకిస్తాన్ భయాందోళన..: పహల్గాం దాడి తర్వాత భారత్ యొక్క కఠిన వైఖరి మరియు అంతర్జాతీయ మద్దతు పాకిస్తాన్‌ను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు వివిధ దేశాలతో దౌత్య సంప్రదింపులు జరుపుతున్నారు.ఐక్యరాజ్యసమితి: షరీఫ్ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్‌తో సంప్రదించి, భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం చేయాలని కోరారు.గల్ఫ్ దేశాలు: సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మరియు కువైట్ రాయబారులతో సమావేశాలు నిర్వహించి, భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. షరీఫ్ సౌదీ అరేబియా రాయబారితో జరిగిన సమావేశంలో దక్షిణాసియాలో శాంతి కోసం పాకిస్తాన్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

చైనా మరియు రష్యా: పాకిస్తాన్ ఈ రెండు దేశాలను సంప్రదించి, భారత్ యొక్క సంభావ్య దాడిని నిరోధించేందుకు సహకారం కోరింది. పాకిస్తాన్ ఈ దాడిపై నిష్పక్షపాత విచారణ కోసం కూడా పిలుపునిచ్చింది. భారత్ నుంచి సంభావ్య దాడిని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ సైన్యం రక్షణాత్మక చర్యలను చేపట్టింది. లష్కర్?ఎ?తొయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్‌కు అదనపు భద్రత కల్పించడం, ఔ?ఇ వెంబడి సైనిక సన్నద్ధతను పెంచడం, మరియు సరిహద్దు ప్రాంతాల్‌ఆహార సరఫరా నిల్వలను పెంచడం వంటి చర్యలు తీసుకుంది.పహల్గాం దాడిని అనేక దేశాలు ఖండించాయి, మరియు భారత్ యొక్క ప్రతీకార చర్యలకు మద్దతు ప్రకటించాయి. ఈ ఘటన అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఒంటరిగా నిలబెట్టింది.భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలు అమెరికా: యుఎస్ స్టేట్ సెక్రటరీ మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సంప్రదించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. అమెరికా భారత్ యొక్క 'స్వీయ రక్షణ హక్కు'ను గుర్తించింది.యూరోపియన్ దేశాలు: యూకె, డెన్మార్క్, మరియు స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ దాడిని ఖండించాయి మరియు భారత్‌తో సహకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి.ఆసియా దేశాలు: దక్షిణ కొరియా జపాన్ భారత్ యొక్క 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శూన్య సహనం' విధానాన్ని సమర్థించాయి.

పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే దేశాలు చైనా: భారత్?పాకిస్తాన్ సంబంధాల్లో చైనా సంప్రదాయకంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తోంది. పహల్గాం దాడి సందర్భంగా కూడా చైనా పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు అందించే అవకాశం ఉంది.టర్కీ మరియు అజర్బైజాన్: ఈ రెండు దేశాలు కాశ్మీర్ విషయంలో గతంలో పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించాయి మరియు ఈ సందర్భంలో కూడా అండగా నిలిచే సూచనలు ఉన్నాయి.బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో ఇటీవలి రాజకీయ సంక్షోభం తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా వైఖరి అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వవచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం..: బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన రాజకీయ అస్థిరత తర్వాత, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను పెంచుకుంటోంది. బంగ్లాదేశ్ యొక్క ఈ కొత్త వైఖరి భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్‌కు రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చు. అయితే, బంగ్లాదేశ్ యొక్క ఆర్థిక మరియు రాజకీయ అస్థిరత దీనిని పరిమితం చేయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పహల్గాం దాడి భారత్?పాకిస్తాన్ మధ్య యుద్ధ సంభావ్యతను పెంచినప్పటికీ, రెండు దేశాలూ అణ్వాయుధ శక్తులు కావడం వల్ల జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారత్ యొక్క గత ప్రతీకార చర్యలు (2016లో ఉరి, 2019లో పుల్వామా) సర్జికల్ స్ట్రైక్‌లు మరియు ఎయిర్‌స్ట్రైక్‌ల రూపంలో ఉన్నాయి. పహల్గాం దాడి కూడా ఇలాంటి ప్రతీకార చర్యలకు దారితీయవచ్చు.పాకిస్తాన్‌సైన్యం ఈదాడిని దేశీయ రాజకీయ సంక్షోభం నుండిదష్టిమళ్లించేందుకు ఉపయోగించుకున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి.అమెరికా,ఐక్యరాజ్యసమితి,మరియుగల్ఫ్ దేశాలు రెండు దేశాలను శాంతియుత సంప్రదింపులకు ప్రోత్సహిస్తున్నాయి.చైనా మరియు రష్యా వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, అవి కూడా ఓపెన్ యుద్ధాన్ని నివారించేందుకు ఒత్తిడి చేయవచ్చు.

## లొకేషన్‌కి వచ్చిన వీరమల్లు



పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమాకోసం ఆయన అభిమానులే కాదు, అందరు హీరోల అభిమానులూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండు భాగాలుగా దర్శకుడు జ్యోతికృష్ణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తొలి పార్ట్ షూట్ దాదాపు పూర్తి కావచ్చింది. పవన్‌కల్యాణ్‌పై నాలుగు రోజుల షూట్ మాత్రమే బ్యాలన్స్ ఉంది. అయితే.. ఆ నాలుగు రోజులకే ఆయన ఇన్నాళ్లూ టైమ్ కేటాయించలేకపోయారు.

అయితే.. ఎట్టకేలకు పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చారని తెలుస్తున్నది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ షూట్‌తో చిత్రీకరణ మొత్తం పూర్తవుతుందట. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నారు.

చారిత్రక పాత్రలతో కూడిన ఫిక్షన్ కథతో ఈ సినిమా రూపొందుతోంది. గోల్కొండ నవాబు కులీ కుతుబ్‌షా, మొఘల్ సామ్రాజ్య చక్రవర్తి ఔరంగజేబు పాత్రలు కథలో కీలకం కానున్నాయట. ఇందులో పవన్‌కల్యాణ్ రాబిన్‌హుడ్ తరహా పాత్రలో కనిపిస్తారట. ఈ సినిమా కథ కోహినూర్ వజ్రం చుట్టూ తిరుగుతుందని సమాచారం. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్,నర్గీస్ ఫక్రీ,నోరా ఫతేహీ,సునీల్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈచిత్రానికి సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కెమెరా: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్, నిర్మాత: ఏ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం.రత్నం,నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.


## విశ్వంభరలో అవనిగా..



త్రిష కథానాయికగా మారి 23ఏండ్లు. స్టార్ హీరోయిన్‌గా ఇంకా సత్తా చాటుతూనే ఉన్నారు త్రిష. హీరోయిన్లలో ఇంతటి లాంగ్విటీ చాలా అరుదు. ఈ విషయంలో త్రిష నిజంగా గ్రేట్. అగ్ర కథానాయకుడు చిరంజీవి హీరోగా రూపొందుతోన్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం 'విశ్వంభర'లో త్రిష కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం త్రిష పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'విశ్వంభర'లో తాను పోషిస్తున్న అవని పాత్రను పరిచయం చేస్తూ ఓ స్టిల్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజసం ఉట్టిపడేలా చీరకట్టులో మెరిసిపోతూ త్రిషఈ స్టిల్‌లో కనిపించారు. ఈ సినిమాలో త్రిష పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈసినిమా రూపొందుతున్నదని, విజువల్ వండర్ ఎక్స్‌పీరియన్స్‌ని ఈ సినిమా అందించబోతున్నదని మేకర్స్ తెలిపారు. అశికా రంగనాథ్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కునాల్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈచిత్రానికి కెమెరా: చోటా కె. నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, దర్శకత్వం: వశిష్ట, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవి క్రియేషన్స్.

## తమ్ముడు వచ్చేస్తున్నాడు

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'తమ్ముడు'. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. ఆదివారం దర్శకుడు శ్రీరామ్ వేణు పుట్టినరోజు సందర్భంగా రిలీజ్ డేట్‌ని మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఓ స్పెషల్ వీడియోను కూడా విడుదల చేశారు. ఇక ఈ వీడియో విషయాని కొస్తే.. సినిమాలోని ప్రధాన తారలైన స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, సీనియర్ నటి లయ,బేబీ శ్రీరామ్ ఆదిత్య ఒక్కొక్కరుగా దర్శకుడు శ్రీరామ్ వేణు దగ్గరకు వస్తారు.వీరంతా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకే తన దగ్గరకు వస్తున్నారని శ్రీరామ్ వేణు అనుకుంటారు. కానీ వాళ్లు 'తమ్ముడు' రిలీజ్ ఎప్పుడు? ప్రమోషన్స్ ఎప్పుడు స్టార్ట్ చేస్తారు? అంటూ శ్రీరామ్ వేణుపై ప్రశ్నలను సంధిస్తారు. సుదీర్ఘ విరామం తర్వాతమళ్లీ రీఎంట్రీ ఇస్తున్న లయ.. తనపోస్టర్ కూడా రిలీజ్ చేయలేదని, తనకు రిలీజ్ డేట్ కూడా చెప్పలేదని వాపోతుంది.



## బుజ్జి కన్నా అని పిలిచారు!


తమిళ చిత్రం 'లవ్‌టుడే' ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువైంది కథానాయిక ఇవానా. 'సింగిల్' చిత్రంతో ఈ భామ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. శ్రీవిష్ణు హీరోగా కార్తీక్‌రాజు దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఇవానా విలేకరు లతో ముచ్చటించింది. గీతా ఆర్ట్స్ వంటి పేరొందిన సంస్థ ద్వారా తెలుగు తెరకు పరిచయం కావడం ఆనందంగా ఉందని చెప్పింది. ఈ సినిమాలో తాను డ్యాన్సర్ హరిణి పాత్రలో కనిపిస్తానని, అందరితో సరదాగా ఉంటూ కుటుంబం కోసం, తను ప్రేమించిన వారికోసం ఏం చేయడానికైనా సిద్ధపడే అమ్మాయిగా తన క్యారెక్టర్ భిన్న పార్శ్వాల్లో సాగుతుందని తెలిపింది. 'ఫుల్‌లెంగ్త్ ఫన్ మూవీ ఇది. ఫ్యామిలీతో హాయిగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. తెలుగు చాలా బ్యూటీఫుల్ లాంగ్వేజ్. ఈ



సినిమా కోసం తెలుగు నేర్చుకోవడానికి ప్రయత్నించా. శ్రీవిష్ణు చాలా సహాయం చేశారు' అని ఇవానా చెప్పింది. ఈ సినిమా ప్రెస్‌మీట్ సందర్భంలో అక్కడికొచ్చిన అభిమానులు 'లవ్‌టుడే'లో తన క్యారెక్టర్ నేమ్ అయిన బుజ్జి పేరుతో 'బుజ్జి కన్నా' అని పిలవడం ఆనందాన్నిచ్చిందని, పాత్ర పేరును గుర్తుపెట్టుకొని పిలవడానికి మించిన ఆనందం ఓ నటికి మరొకటి ఉండదని తెలిపింది. 'రియల్ లైఫ్‌కి రిలేట్ అయ్యే పాత్రలు చేయాలన్నది నటిగా నా లక్ష్యం. ప్రస్తుతం పీజీ చేస్తున్నా. ఓవైపు చదువుకుంటూనే సినిమాల్లో నటిస్తున్నా. తెలుగు, తమిళంలో మంచి ఆఫర్లొస్తున్నాయి' అని ఇవానా చెప్పింది.

## పాక్ నటుడికి సపోర్ట్ చేసిన ప్రకాశ్ రాజ్..

# తిట్టిపోస్తున్న నెటిజన్స్..!



జమ్మూకాశ్మీర్ లోని పహల్గాంలో నరమేధానికి పాల్పడిన పాకిస్తాన్ టెర్రరిస్టులకు తగిన రీతిలో బదులు చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుంది. పహల్గామ్ ఉగ్రదాడికి పాకిస్థాన్‌పై తప్పకుండా ప్రతీకారం తీర్చుకోవాలని దేశవ్యాప్తంగా గట్టి డిమాండ్ వినిపిస్తోంది. ఈ తరుణంలో భారత్‌పై దాడికి పాల్పడినవారికి తగిన రీతిలో బదులివ్వడానికి సైన్యంతో కలిసి పనిచేయడం తన బాధ్యత అంటూ రీసెంట్‌గా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దీంతో త్వరలోనే పాక్‌కి భారత్ గట్టి గుణపాఠం చెప్పనుందని ముచ్చటించుకుంటున్నారు. ఇక ఎప్పటికప్పుడు బీజేపీకి వ్యతిరేఖంగా మాట్లాడే ప్రకాశ్ రాజ్ కొన్ని సార్లు వివాదాస్పద కామెంట్స్ చేస్తూ విమర్శల బారిన పడుతుంటాడు. ఈక్రమంలోనే ఈ స్టార్ నటుడు పాకిస్తాన్ హీరోకి మద్దతుగా నిలవడం సంచలనంగా మారింది. పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా బాన్ చేసింది. ఎగుమతులు, దిగుమతులు ఆపేయడంతో పాటు, వారికి ఇండియా నుంచి రావల్సిన నీటిని కూడా ఆపేసింది. ఛానెల్స్, సోషల మీడియా, సినిమాలు ఇలా అన్నింటిని బ్యాన్ చేసింది. పాకిస్తానీయులని కూడా ఈ దేశం నుండి పంపేయాలని భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇక పాకీస్తాని నటుల సోషల్ మీడియాను బ్లాక్ చేయడం , వారి సినిమాలను బాలీవుడ్ లో రిలీజ్ అవ్వకుండా ఆపేయడం కూడా జరిగింది. ఈ క్రమంలో ప్రకాశ్ రాజ్..పాక్ హీరో సినిమా రిలీజ్‌ను అడ్డుకోవడంపై స్పందించారు. పాకిస్తాన్ నటుడు ఫవాద్ ఖాన్ హీరోగా నటించిన అబిర్ గులాల్ సినిమాను ఇండియాలో బ్యాన్ చేయడాన్ని ప్రకాశ్‌రాజ్ తప్పు పట్టారు. పోర్నోగ్రఫీని తప్పించి ఏ సినిమాను ఇలానిషేదించడం నాకు సరిగ్గా అనిపించడం లేదు. ముందు సినిమా రిలీజ్ చేస్తే ఆడియన్స్ పాక్ నటుల సినిమాలు చూస్తారా లేదా అనేది తెలుస్తుంది. రిలీజ్ చేసి ఆ ఫలితాన్ని వారికే వదిలేస్తేమంచిది అంటూ తాజాగా ఇచ్చినఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు ప్రకాశ్ రాజ్. ఆయన పాక్ నటులకి సపోర్ట్ ఇవ్వడాన్ని నెటిజన్స్ తీవ్రంగా తప్పు పడుతున్నారు. కాగా, పహల్గాం దాడి తరువాత వారి చర్యను ఖండిస్తూ ప్రకాశ్ రాజ్ సుదీర్ఘమైన నోట్ విడుదల చేశారు. ఇటువంటి పనులు మా దేశం చేయదు, దేశ పౌరులు అంతకన్నాచేయరు. మా మంచి తనాన్ని చేతగాని తనంగా భావించవద్దు అంటూ పాకిస్తాన్ కి స్వీట్ వార్నింగ్ ఇచ్చారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215